PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 136 | విజయవాడ, మంగళవారం 19 డిసెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 19 December 2023 | Rs

'మాకు ఛాన్సలర్ కావాలి, సావర్కర్ కాదు'

- కేరళ వర్సిటీలలో నిరసనల హోరు

లోపలి పేజీలో..

ఎన్‌డిఎపై ఐక్య పోరాటం

- ప్రతిపక్ష పార్టీలు కలిసే ఉంటాయి : లాలూ
- నేడు ఢిల్లీలో 'ఇండియా' వేదిక నాలుగో సమావేశం

లోపలి పేజీలో..

కేరళ గవర్నర్ ఆ పదవికి అనర్హుడు

- సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో

ఇండియా న్యూస్ నెట్‌వర్క్- న్యూఢిల్లీ : కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆ పదవికి ఏమాత్రం తగడని సిపిఐ(ఎం) విమర్శించింది. పార్టీ పొలిట్‌బ్యూరో సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికైన రాష్ట్రప్రభుత్వంపై అదే పనిగా రాజకీయ దాడులు చేయడం ద్వారా ఖాన్ అన్ని హద్దులను మీరుతున్నారని, మొత్తంగానే ఆయన తప్పుడు ధోరణిలో ఉన్నారని పొలిట్‌బ్యూరో ఆక్షేపించింది. 'రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగ పతనం మొదలైంది' అంటూ గవర్నర్ చేసిన ప్రకటన దీనికొక తాజా నిదర్శనమని పేర్కొంది. రాష్ట్రప్రభుత్వంపై ఇలాంటి బెదిరింపులను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ అనుమతించరని పేర్కొంది కేరళ, కాలికట్ విశ్వవిద్యాలయాల సెనేట్లలో నామినేట్ చేయాల్సిన స్థానాలను ఆర్‌ఎస్‌ఎస్ నామినీలతో నింపివేయడం ద్వారా విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా గవర్నరు తన పదవిని దుర్వినియోగపరిచారని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ చేష్టలకు గాను విద్యార్థుల నుంచి గవర్నరు నిరసనలను ఎదుర్కొంటున్నారని తెలిపింది. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కు విద్యార్థులకు ఉంది ఈ నిరసనలకు ముఖ్యమంత్రిపై గవర్నర్ నిందలు వేయడం, అవమానకరమైన వ్యాఖ్యలు చేయడంపై సిపిఐ(ఎం) ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజ్యాంగ బద్ధమైన గవర్నర్ పదవిలో ఉన్న వ్యక్తి వ్యవహరించాల్సిన తీరు ఇది కాదని, ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని ఆయన తన చేష్టల ద్వారా నిరూపించుకున్నారని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

ఆదాయం పెంచాల్సిందే!

- వివిధ శాఖలకు ప్రభుత్వం సూచన

3

మరో 78 మంది ఎంపీలపై వేటు

రాజ్యసభలో 45, లోక్‌సభలో 33 మంది సస్పెన్షన్

- పార్లమెంటు చరిత్రలోనే అసాధారణం
- గందరగోళం మధ్యే బిల్లుల ఆమోదం

పార్లమెంటులో భద్రత వైఫల్యంపై చర్చ జరపాలని లోక్‌సభలో నినాదాలు చేస్తున్న ప్రతిపక్ష ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు చరిత్రలోనే అసాధారణమైన రీతిలో ప్రతిపక్ష ఎంపీలపై మోడీ ప్రభుత్వం మూకుమ్మడిగా సస్పెన్షన్ వేటు వేసింది. గత వారం 14 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయగా, తాజాగా సోమవారం మరో 78 మంది ఎంపీలను ప్రస్తుత శీతాకాల సమావేశాలు ముగిసేంతవరకు సస్పెండ్ చేసింది. వీరిలో కొందరిపై సస్పెన్షన్ ప్రివిలైజెస్ కమిటీ నివేదిక ఇచ్చేంత వరకు విధించారు. ఆ నివేదిక రావడానికి ఎంత కాలం పడితే అంతకాలం వీరి సస్పెన్షన్ కొనసాగుతుందన్నమాట. మోడీ ప్రభుత్వ నిరంకుశ పోకడలు అంతకంతకూ శ్రుతిమించిపోతున్నాయనడానికి ఇదొక నిదర్శనమని ప్రతిపక్షాలు విమర్శించాయి. పార్లమెంటు భద్రతను ప్రమాదంలో పడవేసేలా గత వారం లోక్‌సభలో చోటుచేసుకున్న ఘటనపై సభలో చర్చ కోసం పట్టుబట్టడం, భద్రతా వైఫల్యంపై ప్రధాని, కేంద్ర హోం మంత్రి సభకు వచ్చి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరడమే నేరమన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పార్లమెంటుకు జవాబుదారీ వహించాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయకుండా తమ నోరునొక్కేందుకు యత్నిస్తోందని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రెండో విడత సస్పెన్షన్ వేటు పడిన 78 మంది ఎంపీలలో 45 మంది రాజ్యసభకు చెందినవారు కాగా, మిగతావారు లోక్‌సభ సభ్యులు. వీరిలో కాంగ్రెస్ సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి కూడా ఉన్నారు. ఈ శీతాకాల సమావేశాలు ముగిసేంత వరకు వీరిని సస్పెండ్ చేస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. ఇంత భారీ సంఖ్యలో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం పార్లమెంట్ చరిత్రలో ఇదే తొలిసారి. ఎంపిలు కె జయకుమార్, విజయ్ వసంత్, అబ్దుల్ ఖలీక్‌లను లోక్‌సభలో స్పీకర్ పోడియంపైకి ఎక్కి నినాదాలు చేశారని ఆరోపిస్తూ ప్రివిలేజెస్ కమిటీ నివేదిక వచ్చే వరకు సస్పెండ్ చేశారు. రాజ్యసభలో 11 మందిని ప్రివిలేజెస్ కమిటీ నివేదిక వచ్చే వరకు సస్పెండ్ చేశారు. మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రివిలేజెస్ కమిటీకి సూచించారు. ప్రివిలేజెస్ కమిటీకి నివేదించిన వారిలో జెబి మాథర్ హిషామ్, ఎల్ హనుమంతయ్య, నీరజ్ డాంగి, రాజమణి పటేల్, కుమార్ కేత్కర్, జిసి చంద్రశేఖర్, బినోయ్ విశ్వం, పి సంతోష్ కుమార్, మొహ్మద్ అబ్దుల్లా, జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీమ్ ఉన్నారు. సభలో గందరగోళం మధ్యే ప్రభుత్వం కీలకమైన మూడు బిల్లులను మూజువాణి ఓటుతో మమ అనిపించుకుంది. లోక్‌సభ ప్రారంభం కాగానే పార్లమెంట్ భద్రతా వైఫల్యంపై చర్చ జరగాలని, ప్రధాని మోడీ సభకు వచ్చి ప్రకటన చేయాలని ప్రతిపక్ష ఎంపిలు పట్టుపట్టారు. అందుకు ప్రభుత్వం ఎప్పటిలానే తిరస్కరించింది. దీంతో పతిపక్ష ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. స్పీకర్ ఓం బిర్లా సభను పలుమార్లు వాయిదా వేశారు. సభ ప్రారంభమైన 15 నిమిషాల్లోనే మధ్యాహ్నం 12 గంటలకు మొదట వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే టెలి కమ్యూనికేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. తరువాత రెండు సార్లు వాయిదా పడి చివరికి మంగళవారానికి వాయిదా పడింది.

రాజ్యసభలోనూ.. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ భద్రతా వైఫల్యంపై చర్చించాలని పట్టుపట్టారు. అందుకు ప్రభుత్వం సిద్ధపడకపోవడంతో వారు ఆందోళన చేపట్టారు. దీంతో సభను 11:30 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో సభను రాజ్యసభ ఛైర్మన్ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ జమ్ముకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (రెండవ సవరణ) బిల్లు, 2023, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు 2023ను రాజ్యసభలో పరిశీలన, ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. ఆ రెండు బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభ సాయంత్రం 4 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సాయంత్రం 4:30 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో 45 మంది ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేశారు. అనంతరం మంగళవారం నాటికి సభను వాయిదా వేశారు.

పార్లమెంట్ ప్రవేశ ద్వారం వద్ద సస్పెన్షన్ ఎంపిల ఆందోళన

మరోవైపు సస్పెన్షన్‌కు గురైన ఎంపిలు పార్లమెంట్ ప్రవేశ ద్వారం మెట్లపై కూర్చుని ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ సభలోకి అడుగుపెట్టేటప్పుడు నిరసన తెలుపుతున్న ఎంపిలను కలిసి, మద్దతు తెలిపారు.

ఏ పార్టీల వారు ఎంతమంది?

లోక్‌సభలో సస్పెన్షన్‌కు గురైన 33 మంది ఎంపిలలో కాంగ్రెస్‌కు చెందిన 11 మంది, డిఎంకె, టిఎంసిలకు చెందిన తొమ్మిది మంది చొప్పున, ఐయుఎంఎల్‌కు చెందిన ఇద్దరు, ఆర్‌ఎస్‌పికి చెందిన ఒకరు, జెడియుకు చెందిన ఒకరు ఉన్నారు.

రాజ్యసభలో సస్పెన్షన్‌కు గురైన మిగతా 5లో

కోవిడ్‌పై అప్రమత్తం

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం లేఖ

న్యూఢిల్లీ : దేశంలో ఇటీవల కోవిడ్-19 కేసులు పెరుగుదల, జెఎన్.1 వేరియంట్ మొదటి కేసును దేశంలో గుర్తించిన నేపథ్యంలో రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. కోవిడ్ పరిస్థితిపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్య కార్యదర్శులకు సోమవారం రాసిన లేఖలో పేర్కొంది. జిల్లాలవారీగా ఎస్ఎఆర్ఐ, ఐఎల్ఐ కేసులను క్రమం తప్పకుండా నివేదించాలని, పర్యవేక్షించాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఆర్‌టి - పిసిఆర్ పరీక్షలను అధిక సంఖ్యలో చేయడంతోసహా తగినన్ని పరీక్షలు చేయాలని కోరింది. పాజిటివ్ శాంపిల్స్‌ను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం ఐఎన్ఎస్ఎసిఒజి ప్రయోగశాలలకు పంపాలని ఆదేశించింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై ఆరోగ్యశాఖ అధికారులు గట్టి నిఘా ఉంచాలని సూచించింది. జ్వరపీడితుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఛాతీలో నొప్పి, రక్తపోటు తగ్గడం, ఆహారం తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారు వైద్యులను సంప్రదించాలని కేంద్రం కోరింది. అనుమానిత కోవిడ్-19 లక్షణాలు ఉన్న వ్యక్తులు ల్యాబ్‌ల్లో పరీక్షలు చేసుకోవాలని కేంద్రం సూచించింది.

24 గంటల్లో 260 కేసులు

దేశంలో సోమవారం ఉదయం నాటికి గత 24 గంటల వ్యవధిలో కొత్తగా 260 కరోనా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం క్రియాశీల కేసులు 1,828కు చేరుకున్నాయి. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. దేశంలో ఇప్పటివరకూ మొత్తంగా 5,33,317 కరోనా మరణాలు సంభవించాయని తెలిపింది. మొత్తం కరోనా కేసుల సంఖ్య 4,50,05,076గా ఉంది.

'జిందాల్'తో రహస్య ఒప్పందంపై ఆగ్రహం

పూర్తి వివరాలు బయటపెట్టాలంటూ స్టీల్‌ప్లాంట్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం), అమరావతి బ్యూరో

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్-3ని నడిపేందుకు జిందాల్ సంస్థతో చేసుకున్న రహస్య ఒప్పందాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేస్తూ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ ప్రధాన రహదారిలో కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆగిందని ప్రచారం చేస్తూనే, స్టీల్‌ప్లాంట్ సిఎండి ఢిల్లీలో కూర్చుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. రూ.3 లక్షల కోట్ల విలువైన ప్లాంట్‌ను రూ.500 కోట్ల కోసం తాకట్టు పెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ఎండిసి నుంచి ముడి సరుకులు, సొంత గనులు కేటాయిస్తే కార్మికులంతా కలిసి ఉత్పత్తి సాగించి రూ.9 వేల కోట్లను కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిందాల్ రావడంలేదని, సెయిల్‌తో మాట్లాడుతున్నామని ఈ నెల రెండో తేదీన చెప్పారని, ఇంతలోపే ఏం జరిగిందని ప్రశ్నించారు. ఢిల్లీ పెద్దల సమక్షంలో జరుగుతున్న రహస్య ఒప్పందాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బ్లాస్ట్ మిగతా 2లో

స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తున్న ఉక్కు కార్మిక సంఘాల నాయకులు

ప్లాంటులోకి జిందాల్ కంపెనీని రానివ్వం : సిఐటియు

విశాఖ స్టీలు ప్లాంటులోకి జిందాల్ కంపెనీని రానివ్వబోమని సిఐటియు రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్.నరసింగరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. స్టీలు ప్లాంట్‌కు గుండెకాయ వంటి బ్లాస్ట్ ఫర్నేస్-3 కేంద్ర ప్రభుత్వం నిలిపేయడంతో ఉత్పత్తి 30 శాతానికిపైగా రెండేళ్లు తగ్గి నష్టాలను పెంచిందని పేర్కొన్నారు. పోస్కో, జిందాల్ వంటి సంస్థలను అడ్డం పెట్టుకుని వ్యవహారం నడుపుతున్నాయని విమర్శించారు. నిజంగా ప్లాంట్‌ను నడపాలనుకుంటే రూ.1200 కోట్లు అప్పు తీసుకోవడానికి అనుమతిస్తే చాలని, 22 నెలల నుండి ఈ పనిచేయడం లేదని తెలిపారు. దీనిపై ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బ్లాస్ట్ ఫర్నేస్-3 నిర్వహణ బాధ్యతను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)కు అప్పగించాలని కోరారు.

ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తు పురోగతి చెప్పండి

- సిబిఐకి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

బి-ఫార్మసీ విద్యార్థి ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తు ఏ దశకు చేరిందీ వివరించాలని సిబిఐకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం వద్ద ఒక ప్రైవేట్ వసతి గృహంలో 2007 డిసెంబరు 27న జరిగిన ఆయేషా హత్య కేసు పురోగతిని వివరించాలని కేంద్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్, విశాఖలోని సిబిఐ ఎస్‌పిలను ఆదేశించింది. విచారణను 3 వారాలకు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ ఎన్ జయసూర్య చెప్పారు. ఆయేషా హత్య కేసు విచారణకు హాజరుకావాలని విశాఖ సిబిఐ నోటీసు ఇవ్వడాన్ని ఆ కేసులో నిర్దోషిగా బయటపడిన పి సత్యంబాబు హైకోర్టులో సవాల్ చేశారు. కింది కోర్టు విధించిన శిక్షను హైకోర్టు 2017 మార్చి 31న రద్దు చేసిందని పిటిషనరు తరపున న్యాయవాది చెప్పారు. దోషులను గుర్తించి శిక్షించాలని ఆయేషా తల్లిదండ్రులు శంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ పాషా వేసిన కేసుల్లో హైకోర్టు 2018లో సిబిఐ దర్యాప్తునకు ఆదేశించిందన్నారు. కోర్టు అనుమతి లేకుండానే సత్యంబాబుకు డిఎన్ఎ పరీక్ష నిర్వహించారని న్యాయవాది తెలిపారు.

పేదలకు మరింత చేరువగా ఆరోగ్యశ్రీ

కొత్త కార్డుల పంపిణీలో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్య శ్రీ కుటుంబాన్ని పేదలకు మరింత చేరువ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని 25 లక్షల రూపాయలకు పెంచిన నేపథ్యంలో నూతన కార్డుల జారీ ప్రక్రియను సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రసంగించారు. ఈ ప్రసంగాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాపతినిధులు, గ్రామ-వార్డు సచివాలయాల సిబ్బంది వీక్షించారు. సిఎం మాట్లాడుతూ వైద్యం కోసం అప్పులు పాలయ్యే పరిస్థితి ఎవరికీ ఉండకూడదన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని 25 లక్షల రూపాయలకు పెంచడం చారిత్రాత్మకమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.48 కోట్ల కుటుంబాలను, 4.25 కోట్ల జనాభాను ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. 4.25 కోట్ల జనాభాను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చిన్నట్లు చెప్పారు. వెయ్యి రూపాయలు దాటి ఖర్చయ్యే ప్రొసీజర్లన్నింటిని ఆరోగ్యశ్రీ కిందకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. గతంలో ఉచిత ఆరోగ్యశ్రీ సేవలు 748 ఆస్పత్రులకు పరిమితంగా ఉండేవని, ఇప్పుడు 2,513 నెట్‌వర్క్ ఆసుత్రులకు విస్తరించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లకాలంలో రూ.5171 కోట్లు ఖర్చు చేస్తే ఈ ప్రభుత్వం ఏడాదికి ఆరోగ్యశ్రీ, ఆరోగ్య అవసరాల కోసం రూ.4100 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

పేదవాడికి అండగా ఆరోగ్య ఆసరా

వైద్యం చేయించడమే కాకుండా నయమయ్యే వరకూ నెలకు రూ.5 వేలు చొప్పున రెండు నెలలు అయితే నూ.10 వేలు పేదవాడి చేతిలో పెట్టి ఇంటికి పంపించే కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య ఆసరా కింద 25,27,870 మందికి రూ.1,309 కోట్లు చెల్లించామన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఈ ప్రభుత్వంలో 53,02,816 మంది చికిత్స తీసుకున్నారని చెప్పారు. గతంలో ఆరోగ్యశ్రీ కింద క్యాన్సర్ వంటి రోగాలకు రూ.5 లక్షల దాటితే ఇచ్చేవారు కాదని, కీమోథెరిపీ లాంటిది ప్రారంభిస్తే రెండు, మూడు డోసులకు రూ.5 లక్షలు అయిపోయేవన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత క్యాన్సర్ ఎంత ఖర్చు అయినా ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

పైలాన్‌ను ఆవిష్కరించి ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకేష్, పార్టీ నాయకులు

యువతకు భరోసానిచ్చేందుకే యువగళం

- పాదయాత్ర ముగింపులో నారా లోకేష్
- 226 రోజులు.. 3,132 కిలోమీటర్ల నడక

ప్రజాశక్తి - గాజువాక, ఉక్కునగరం (విశాఖ)

వైసిపి ప్రభుత్వ నియంతృత్వంపై ప్రజా యుద్ధమే యువగళమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. తన పాదయాత్ర యువతకు భరోసానిచ్చిందని, అణచివేతకు గురైన వర్గాల గొంతుకైందని పేర్కొన్నారు. కుప్పంలో ఈ ఏడాది జనవరి 27న ప్రారంభమైన యువగళం పాదయాత్ర 226 రోజులపాటు మిగతా 2లో

నాలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఎ సోదాలు

- ఎనిమిది మంది అరెస్టు

బెంగళూరు : నాలుగు రాష్ట్రాల్లోని 19 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్)తో సంబంధాలున్న మినాజ్ అలియాస్ మహ్మద్ సులేమాన్‌తో సహా ఎనిమిది మందిని అరెస్టు చేశారు. 'ఐఇడి పేలుళ్లను నిర్వహించడానికి నిందితులు బళ్లారిలో వేసిన ప్రణాళికను భగ్నం చేశాం' అని ఎన్ఐఎ పేర్కొంది. కర్ణాటకలోని బళ్లారి, బెంగళూరుల్లోనూ మహారాష్ట్రలోని అమరావతి, ముంబయి, పుణేల్లోనూ, జార్ఖండ్‌లోని జెంషెడ్‌పూర్, బోకరోల్లోనూ ఈ సోదాలు జరిగాయి. బళ్లారి మాడ్యూల్‌పై ఈ నెల 14న ఎన్ఐఎ కేసు నమోదు చేసింది. అరెస్టయిన వారిలో బళ్లారికి చెందిన మినాజ్ అలియాస్ మహ్మద్ సులేమాన్, సయ్యద్ సమీర్, ముంబయికి చెందిన అనాస్ ఇక్బాల్ షేక్, మహ్మద్ మునీరుద్దీన్, సయ్యద్ సమీవుల్లా అలియాస్ సమీ, బెంగళూరుకు చెందిన మహ్మద్ ముజమ్మిల్, ఢిల్లీకి చెందిన షయాన్ రహమాన్ అలియాస్ హుస్సేన్, మహ్మద్ అలియాస్ ఝుల్‌బాజ్ ఉన్నారు.

అల్లూరి జిల్లా రంపచోడవరం ఐటిడిఎను ముట్టడించిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

కలెక్టరేట్లు, ఆర్‌డిఒ ఆఫీసుల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరుకుంది. రోజురోజుకూ ఆందోళన తీవ్రరూపం దాల్చుతోంది. కలెక్టరేట్లు, ఆర్‌డిఒ కార్యాలయాలు ధర్నాలో దద్దరిల్లాయి. మండల కేంద్రాలు, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద దీక్షలు సాగిస్తున్న అంగన్‌వాడీలకు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. తెలంగాణలో కంటే ఎక్కువ వేతనం ఇస్తామని సిఎం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఫేస్‌యాప్ విధానం రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, గ్రాట్యూటీ, పెన్షన్ అమలు చేయాలని, మిగతా 2లో

ఇంధనశాఖ అధికారులకు సిఎం అభినందన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్-2023లో అత్యుత్తమ ఇంధన సామర్థ్య అవార్డును అందుకున్న నేపథ్యంలో ఇంధనశాఖ అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ఇటీవల ఈ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అధికారులు అందుకున్నారు. ముఖ్యమంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు, జెఎమ్‌డి బి మల్లారెడ్డి, ఎపిఎస్ఇసిఎం సిఇఒ బిఎవిపి కుమార్ రెడ్డి సోమవారం కలిశారు. అవార్డు వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వరుసగా రెండేళ్లలో రెండుసార్లు ఈ అవార్డును రాష్ట్రం దక్కించుకుంది.

విశాఖలో గుప్తనిధుల తవ్వకాలు కలకలం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలో గుప్తనిధుల తవ్వకాలు కలకలం రేపాయి. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి, తాటిచెట్లపాలెం రైల్వే క్వార్టర్స్‌లో ఓ ఇంటి ఆవరణంలో పూజలు చేసి తవ్వకాలు జరిపారు. రైల్వే ఉద్యోగి ఆధ్వర్యంలో 20 అడుగుల గొయ్యి తవ్వేశారు. గుప్తనిధుల తవ్వకాల కోసం విజయవాడ నుంచి వ్యక్తులను తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. విషయం బయటకు పొక్కడంతో గేట్లకు తాళాలు వేసిన సదరు వ్యక్తులు.. దోష నివారణ కోసం పూజలు చేశామంటూ చెప్పుకొస్తున్నారు. విషయం తెలిసి కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. రైల్వే ఉద్యోగి కోటేశ్వరరావు కొద్ది రోజులు క్రితం ఓ స్వామీజీని ఇంటికి తీసుకొచ్చాడు. ఆయన ఇంటి ఆవరణను పరిశీలించి ఓ ప్రాంతంలో వైబ్రేషన్స్ వచ్చాయని, గుప్త నిధులు ఉన్నాయని కోటేశ్వరరావుతో చెప్పాడు. వెంటనే ఓ గ్యాంగ్‌ను పిలిచి తవ్వకాలు చేపట్టాడు. అయితే తవ్వుతున్న శబ్దాలు చుట్టుపక్కలవారికి వినపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. డీజే తీసుకొచ్చి పాటలు పెట్టేవారు. పాట ఆగి పోయిన వెంటనే తవ్వకాలు ఆపేసేవారు. నెల రోజులుగా ఇలా తవ్వకాలు సాగాయి. ఎవరూ రాకుండా, చూడకుండా చుట్టూ అడ్డుగా చీరలను కట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. నగరం నడిబొడ్డులో ఇలా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరపడం సంచలనంగా మారింది. ఈ తవ్వకాలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

'జిందాల్'తో రహస్య ఒప్పందంపై ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

ఫర్నేస్‌ను నడిపేందుకు రూ.1,200 కోట్లు సరిపోతాయని సిఎండి స్వయంగా చెప్పారని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తే ఆ నిధులు సమీకరించడం పెద్ద కష్టం కాదని తెలిపారు. ఎన్ఎండిసికి రెండు వేల కోట్ల రూపాయలు అప్పు తీర్చారని, బ్యాంకులకు రుణాలు కడుతున్నారని, జిఎస్‌టి చెల్లిస్తున్నారని, కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు నగదు లేదని చెప్పి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కార్మిక వర్గం పోరాడి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటుందని స్పష్టం చేశారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రలో భాగంగానే ఆగమేఘాల మీద సిఎండిని ఢిల్లీకి పిలిపించుకొని చర్చలు జరపాలని విమర్శించారు. ఈ రహస్య ఒప్పందాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో ఉక్కు కార్మిక సంఘాల నాయకులు యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ పాల్గొన్నారు.

చీకటి ఒప్పందం దారుణం : సిపిఎం

స్టీల్‌ప్లాంట్-జిందాల్ మధ్య చీకటి ఒప్పందం దారుణమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. విశాఖలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రం ఇంతటి ద్రోహానికి పూనుకుంటే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు.

వార్తలను ఖండించిన స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం

కార్మిక సంఘాల వివరాల ఆధారంగా స్టీల్‌ప్లాంట్‌పై కొన్ని మీడియా సంస్థలు వార్తలను ప్రచురించడాన్ని వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఖండించింది. స్టీల్ ప్లాంట్ మేనేజ్‌మెంట్ ఈ నెల 30న మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను పునఃప్రారంభించేందుకు నూతన ప్రణాళికలతోనే ముందుకు వెళ్తోందని వెల్లడించింది. స్టీల్‌ప్లాంట్ అధికారిక వర్గాల నుంచి వాస్తవాలను ధ్రువీకరించుకోవాలని మీడియా సంస్థలను కోరింది.

గోదావరి జిల్లాల లెక్క తేలిందా ?

తాడేపల్లికి క్యూ కట్టిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2024 ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక కసరత్తును వైసిపి ముమ్మరం చేసింది. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో 11 మంది సిట్టింగ్ అభ్యర్థులను మారుస్తూ తీసుకున్న నిర్ణయం తరహాలోనే ఉభయగోదావరి జిల్లాల్లో కూడా మార్పులు చేపడుతున్నట్లు సమాచారం. దీంతో ఈ రెండు జిల్లాలకు చెందిన ఎంఎల్‌ఏలు తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయానికి సోమవారం క్యూ కట్టారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంఎల్‌ఏలు కూడా సిఎంను కలిశారు. మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, జోగి రమేష్‌లు, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్‌లతో పాటు గుంటూరు నుండి మద్దాలి గిరి, చింతలపూడి ఎమ్మెల్యే ఎలిజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పూర్ణచంద్రప్రసాద్, పోలవరం ఎమ్మెల్యే బాలరాజు, పీఠాపురం ఎమ్మెల్యే పి దొరబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఉంగుటూరు ఎమ్మెల్యే రాజు క్యాంప్ కార్యాలయంకు చేరుకుని తమ అభిప్రాయాలను తెలియచేసినట్లు సమాచారం. ఇప్పటికే



ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలపై ప్రజల్లో అభ్యర్థులకు వున్న అనుకూలత, ప్రతికూలత అంశాలు, పార్టీనాయకులు, కార్యకర్తలతో వున్న సమన్వయం, అవినీతి ఆరోపణలు, ప్రత్యర్థిని ఢీకొట్టే సామర్థ్యంలాంటి అంశాలతో పలు దఫాలుగా సర్వేలు చేయించుకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి మొహమాటం లేకుండా సిట్టింగ్‌ల సీట్‌పై తేల్చిచెబుతున్నట్లు తెలిసింది. సీట్ ఇచ్చేది లేదని ప్రత్యామ్నాయం చూస్తామని హామీ ఇస్తున్నట్లు చెబుతున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 17, పశ్చిమగోదావరి జిల్లాలో 19 సీట్లు కలిపి 36 నియోజకవర్గాలు ఈ రెండు జిల్లాల్లోనే వుండటంతో ఈ జిల్లాపై వైసిపి అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తోంది. అన్ని సర్వేల్లో ప్రతికూలతలు వచ్చిన ఎమ్మెల్యేలకు ఇప్పటికే పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి టికెట్‌లపై అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని చెప్పేసినట్లు తెలిసింది. దీంతో సిట్టింగ్‌లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం ఉమ్మడి కృష్ణా జిల్లాల సిట్టింగ్‌లకు సమాచారం ఇవ్వడంతో కృష్ణా జిల్లా రాజకీయాల్లోనూ ప్రకంపనలను సృష్టిస్తోంది. కృష్ణా జిల్లాలో కూడా మంత్రి జోగి రమేష్‌ను పార్లమెంట్‌కు పంపి పెడనలో మరొకరికి అవకాశం కల్పిస్తారని, అలాగే కీలకమైన విజయవాడలో వున్న ఇద్దరు సిట్టింగ్‌లను మారుస్తారనే సమాచారంతో సోమవారం గోదావరి జిల్లాల నుండి, కృష్ణా జిల్లాల నుండి వచ్చిన ఎమ్మెల్యేలతో తాడేపల్లి కిటకిటలాడింది. రామచంద్రాపురం నుండి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రాజమండ్రి రూరల్‌కు మార్చే ఆలోచన వైసిపి నాయకత్వం చేస్తున్నట్లు సమాచారం. రామచంద్రాపురం సీటును ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్ కుమారునికి ఖరారు చేసినట్లు తెలిసింది. అలాగే మంత్రి విశ్వరూప్ స్థానంలో ఆయన కుమారున్ని ఖరారు చేసే అంశాన్ని అధిష్టానం చేస్తోంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మొత్తంగా 8మంది సిట్టింగ్‌లను మార్చేందుకే అధిష్టానం మొగ్గు చూపుతుండటంతో సిట్టింగ్‌లలో ఆందోళన మొదలైంది.

ఆస్తి కోసం ఆరు హత్యలు

- లోన్ ఇప్పిస్తానంటూ స్నేహితుడుసహా అతని కుటుంబంపై ఘాతుకం
- నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో కలకలం రేపిన ఘటన
- నిందితుడు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అనుచరుడు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్నేహితుని ఆస్తికోసం ఆశపడి అతని కుటుం బంలో ఆరుగురిని నిందితుడు పొట్టనపెట్టు కున్నాడు. స్నేహితుడితో పాటు తన కుటుంబాన్ని ఒక్కొక్కరిని ఒక్కోచోట హతమార్చాడు. అలా వారం వ్యవధిలోనే ఆరు హత్యలు చేశాడు. ఈ ఘటన నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. కాగా నిందితుడు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అనుచరుడు కావడం గమనార్హం. సంబంధీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన రాచర్ల పూనప్రసాద్ (35) కుటుంబం ఏడాది క్రితం స్వగ్రామాన్ని వదిలి.. కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డికి వెళ్లి స్థిరపడ్డారు.

ఆయనకు భార్య రమణి (32) గర్భిణి, కొడుకు చైతు (6), కూతురు చైత్రి (6) కవలలు, ముగ్గురు చెల్లెండ్లు స్వప్న (32), శ్రావణి, స్రవంతి (25) ఉన్నారు. అయితే ప్రసాద్‌కు మాక్లూర్‌లో ఓ ఇల్లు ఉంది. ప్రసాద్ స్నేహితుడైన మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన మెడిద ప్రశాంత్ ఆ ఇంటిపైన కన్నేశాడు. ప్రసాద్ అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో లోన్ ఇప్పిస్తానని ఆ డబ్బుతో అప్పులు తీర్చుకోవచ్చని ప్రసాద్‌ను ప్రశాంత్ నమ్మించాడు. సులువుగా రుణం వస్తుందని చెప్పి.. ప్రశాంత్ పేర ఆ ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించు కున్నాడు. బ్యాంకుల చుట్టూ తిరిగినా లోన్ రాక పోవడంతో.. ఇల్లును తిరిగి తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని ప్రశాంత్‌పై ప్రసాద్ ఒత్తిడి తీసుకొచ్చా డు. ఎలాగైనా ఆ ఇంటిని తన సొంతం చేసుకోవాల నుకున్న ప్రశాంత్.. పతకం ప్రకారం ప్రసాద్‌ను ఈ నెల 9న బయటకు తీసుకెళ్లాడు. నిజామాబాద్-కామారెడ్డి జాతీయ రహదారికి సమీపంలోని అటవీ ప్రాంతంలో ప్రసాద్‌ను హత్య చేశాడు. మరుసటి రోజే ప్రసాద్ ఇంటికి వెళ్ళి.. తన భర్తను పోలీసులు అరెస్టు చేశారని ప్రసాద్ భార్య రమణిని నమ్మించి బయటకు తీసుకెళ్ళాడు. ఆమెను సైతం హతమార్చి బాసర నదిలో పడేశాడు. ఆ తర్వాత ప్రసాద్ పెద్ద సోదరి స్వప్నను హత్య చేశాడు. ఇద్దరు పిల్లలు చైతు, చైత్రి కవల పిల్లలను సోన్ బ్రిడ్జి సమీపంలో హత్యచేశాడు. ప్రసాద్ చిన్న సోదరి స్రవంతిని మాచారెడ్డి సమీపంలో హత్య చేశాడు. మొదటి మూడు హత్యలు ఒక్కడే చేశా డని.. మిగిలిన మూడు హత్యల్లో మరో ముగ్గురి ప్రమేయం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. కాగా.. నిందితుడు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు. బిఆర్ఎస్ యూత్ అధ్యక్షునిగా ఉన్నాడు. ఈ హత్యల్లోని ఓ శవం ఆధారంగా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నారు.

సోమిరెడ్డి దీక్ష భగ్నానికి యత్నం

- శిబిరం వద్ద కార్లపై దాడి
- అడ్డుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-పొదలకూరు (నెల్లూరు)

నెల్లూరు జిల్లా పొదలకూరులో అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేపట్టిన సత్యాగ్రహ దీక్షను భగ్నం చేసేందుకు కొందరు ప్రయత్నించారు. శిబిరాన్ని ధ్వంసం చేసేందుకు వందమందికిపైగా వచ్చారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి నాయకుల కార్లను పగలకొట్టారు. దీంతో, ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. శిబిరం ధ్వంసానికి వచ్చిన వారిని టిడిపి నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసులు శిబిరం వద్దకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, మైనింగ్‌లో పనిచేస్తున్న 12 టిప్పర్లు, ఆరు హిటాచీ వాహనాలను తీసుకెళ్లేందుకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శిబిరంపై దాడి చేయించారని ఆరోపించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సొంత గ్రామానికి సమీపంలోనే ఇంత దారుణం జరుగుతున్నా ముడుపులు తీసుకుని అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. దాడులకు భయపడేది లేదని, దీక్షను కొనసాగిస్తానని తేల్చి చెప్పారు. తాటిపర్తి పంచాయతీ పరిధిలోని రుస్తుం, భారత్ మైకా గనుల్లో క్వార్ట్జ్ తవ్వకాలను శనివారం సోమిరెడ్డి పరిశీలించారు. అధికారులు వచ్చి అక్రమ మైనింగ్‌ను అడ్డుకుని, వాహనాలను సీజ్ చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని సత్యాగ్రహ దీక్ష చేపట్టారు.

రూ.1400 కోట్ల అవినీతి

- ఆరోగ్యశ్రీని భ్రష్టు పట్టించిన మాజీ ఎమ్మెల్యే కుమారుడు అశోక్‌రెడ్డి
- వైసిపి రెబల్ నేత పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి ఆరోపణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి కుమారుడు అశోక్‌రెడ్డి భ్రష్టు పట్టిస్తున్నారని, రూ.1400 కోట్లు అవినీతికి పాల్పడ్డా రని వైసిపి బహిష్కృత నేత పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. అశోక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని తన కార్యాల యంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అశోక్‌రెడ్డి పొదిలిలో సొంత ఆస్పత్రిని ఏర్పాటు చేసుకొని ఆరోగ్యశ్రీ ఎంప్యానల్‌మెంట్ ఉందంటూ చుట్టుపక్కల పేదల నుంచి ప్రతినెలా సుమారు రూ.55 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి తాను చెప్పిందే వేదమని చెబుతున్నారని, తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఇఒ తాను చెప్పిందే వింటారని, రాబోయే రోజుల్లో వైసిపి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పిస్తారంటూ ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు అశోక్‌రెడ్డిపై రూ.1400 కోట్ల అవినీతి ఆరోపణలు ఉన్నాయని, వైద్య వృత్తిని అప్రతిష్టపాలు చేస్తున్నారని విమర్శించారు. కరోనా సమయంలో రూ.100 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వైద్య వత్తిని అడ్డం పెట్టుకొని లక్షలు దోచుకుంటున్న అశోక్‌రెడ్డి అవినీతిపై సిబిఐతో విచారణ చేయించి ఆరోగ్యశ్రీ ఎంప్యానల్‌మెంట్ రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

ఇతర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీంతో, ఆయా కార్యాలయాల పరిసరాలు హోరెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా 74 ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. సమ్మె శిబిరాలను ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ సంఘాల నాయకులు, సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన పార్టీ, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. కొన్నిచోట్ల అధికారులు సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించినా తల్లిదండ్రులు ఎవరూ తమ పిల్లలను పంపలేదు. ప్రకాశం జిల్లా కనిగిరిలో ఆర్‌డిఒను అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. ఒంగోలు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద పోలీసుల పహరా ఉండడంతో రూట్ మార్చి ప్రకాశం భవనం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించిన అంగన్‌వాడీలను పోలీసులు అడ్డగించారు. దీంతో, వారు అక్కడే బైటాయించారు. అక్కడికి బాపట్ల ఆర్‌డిఒ గంధం రవీందర్ వచ్చి వారి నుంచి వినతిపత్రం తీసుకున్నారు. అల్లూరి జిల్లా రంపచోడవరంలో ఐటిడిఎ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. పిఒకు వినతిపత్రం ఇచ్చేందుకు లోపలకు వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో, గేట్‌కు ఎదురుగా అంగన్‌వాడీలు బైటాయించడంతో ఐటిడిఎ ఎపిఒ శ్రీనివాస్ అక్కడికి వచ్చి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్ధలుగొట్టకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. చింతూరు ఐటిడిఎ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. ఏజెన్సీలోని అన్ని మండలాల్లో మానవహారాలు, ర్యాలీలు నిర్వహించారు. విజయనగరం కలెక్టరేట్ నిరసన శిబిరం నుంచి ఆర్‌డిఒ కార్యాలయానికి అంగన్‌వాడీలు ర్యాలీ వచ్చి అక్కడ బైటాయించారు. ఆర్‌డిఒ బయటకు వచ్చి తమ సమస్యలు వినాలని,

పుట్టపర్తి ఆర్‌డిఒ కార్యాలయం ముందు పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలు కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ ఎప్పటికీ రాకపోవడంతో కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఒకటో పట్టణ సిఐ పరిస్థితిని ఆర్‌డిఒకు వివరించారు. దీం తో, మధ్యాహ్నం ఒంటిగంటకు అక్కడికి వచ్చి న ఆర్‌డిఒకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

భారీ ర్యాలీలు, వినూత్న నిరసనలు

అనంతపురం, పుట్టపర్తిలో అంగన్‌వాడీలు పొర్లు దండాలతో నిరసన తెలిపారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట మానవహారాలు నిర్వహించారు. తిరుపతి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రోడ్డుపై భిక్షాటన చేశారు. తాము ఎందుకు సమ్మె చేస్తున్నామో అందరికీ వివరించారు. నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంతో పాటు పలు జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు.

తాళాలు పగులగొట్టనీయకుండా ప్రతిఘటన

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం లంక గ్రామాలతోపాటు మైలవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టేందుకు అధికారులు ప్రయత్నించగా గ్రామస్తులు, మహిళలు అడ్డుకున్నారు. దీంతో, అధికారులు వెనుదిరిగారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మెల్లంపూడి, దుగ్గిరాల ఆలీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టేందుకు ప్రయత్నించిన సచివాలయ అధికారులను అంగన్‌వాడీలు, స్థానికులు అడ్డుకున్నారు.

చట్టాన్ని ప్రభుత్వం ఉల్లంఘిస్తుండడం పట్ల ఆగ్రహం

కాకినాడలో ధర్నాకు పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, సమ్మెను విరమింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏలూరులోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు (సిఐటియు) జి.బేబీరాణి మాట్లాడుతూ ఏడు రోజులుగా సమ్మె జరుగుతున్నా సమస్యను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు, తలుపులు బద్ధలు కొడుతూ ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలులో మున్సిపల్ కార్పొరేషన్ ముందు ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిఐటియు శ్రామిక మహిళ రాష్ట్ర నాయకులు పి.నిర్మల, ఎఐటియుసి అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ పాల్గొని మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టి సచివాలయ సిబ్బందికి సెంటర్లను అప్పగించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నాలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి పాల్గొని మద్దతు తెలిపారు.

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం, ఐలవరంలో అధికారులను అడ్డుకున్న లబ్ధిదారులు

నెల్లూరులో అంగన్‌వాడీల ర్యాలీ

విశాఖ ఉక్కుకు భూములు బదలాయించం

- రాజ్యసభలో కేంద్ర మంత్రి ఫగన్ సిమగ్ కులస్తే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సేకరించిన భూములను ఆ కర్మాగారానికి బదలీ చేసే ప్రతిపాదన ఏదీ లేదని ఉక్కు శాఖ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే స్పష్టం చేశారు. రాజ్యసభలో సోమవారం వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం సేకరించిన భూములను ఆ ప్లాంట్‌కు బదలాయించడం ద్వారా దాని ఆస్తుల విలువను, రుణ శక్తిని పెంపొందించడానికి అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం అందుకు నిరాకరించడానికి కారణాలు ఏమిటి... అంటూ విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. దీనికి మంత్రి వివరణ ఇస్తూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్) ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వం భూములను సేకరించి అప్పగించింది. తదనంతరం ఆ భూములపై సర్వహక్కులను కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖకు బదలాయించడం జరిగింది. స్టీల్ ప్రాజెక్టు కోసం ఆ భూములను వినియోగించుకోవడానికి వీలుగా ఉక్కు మంత్రిత్వశాఖ ఆర్ఐఎన్ఎల్‌కు పవర్ ఆఫ్ అటార్నీ జారీ చేసింది. అందువలన ఆ భూములపై యాజమాన్య హక్కులను ఆర్ఐఎన్ఎల్‌కు బదిలీ చేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని మంత్రి స్పష్టం చేశారు.

రౌర్కెలా స్టీల్ ప్లాంట్ మినహా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) దేశంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన స్టీల్ ప్లాంట్ల భూములపై సర్వ హక్కులు ఆయా ప్లాంట్ల పేరిట దఖలు పడి ఉన్నట్లు ఉక్కుశాఖ మంత్రి తెలిపారు. భిలాయ్ స్టీల్ ప్లాంట్, బొకారో స్టీల్ ప్లాంట్, దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్, ఇస్కో స్టీల్ ప్లాంట్, సేలం స్టీల్ ప్లాంట్ అలాయ్ స్టీల్ ప్లాంట్, విశ్వేశ్వరయ ఐరన్, స్టీల్ ప్లాంట్‌లు నెలకొల్పిన భూములకు ఆయా ప్లాంట్‌లే యాజమాన్య హక్కులు కలిగి ఉన్నాయి. రౌర్కెలా స్టీల్ ప్లాంట్ భూములు మాత్రం లీజు పద్ధతిలో కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

సీటు వస్తుందా ? రాదా ?

- పొత్తు నేపథ్యంలో టిడిపి నేతల్లో గుబులు
- జనసేన ఎన్ని అడుగుతుందనే ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి, జనసేన పొత్తు నేపథ్యంలో టిడిపిలో అసెంబ్లీ టిక్కెట్లు ఆశిస్తున్న కొంతమంది నేతల్లో గుబులు నెలకొంది. టిడిపి, జనసేన అధినేత భేటీతో వారిలో ఆందోళన మరింత పెరిగింది. ఈ భేటీలో పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటు కూడా చర్చకు వచ్చినట్లు టిడిపి నేతలు చెబుతున్నారు. వైసిపి అధినేత జగన్ ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై దూకుడుగా ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చడం, కొత్తవారిని తెరపైకి తీసుకురావడం వంటి నిర్ణయాలనుఅమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ పార్టీల నుంచి కూడా అభ్యర్థులను ఖరారు చేయాలని చంద్రబాబు, పవన్ నిర్ణయానికి వచ్చి న్నట్లు తెలిసింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చే రెండు వారాల ముందే పొత్తులు, సీట్లు ఖరారు చేయాలని అనుకున్నట్లు సమాచారం. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు మాత్రం 120 స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తిచేసినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. మిగిలిన 55 సీట్లను పొత్తులో భాగంగా పెండింగ్‌లో ఉంచారు. ఇరు పార్టీల మధ్య అవగాహన వచ్చి అభ్యర్థులు ఖరారు చేసుకున్న తరువాత ఈ సీట్లను ప్రకటించాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లాలో తెనాలి, ఉమ్మడి కృష్ణాలో విజయవాడ పశ్చిమ, ప్రకాశంలో దర్శి, తూర్పు గోదావరిలోని రాజమండ్రి, రాజోలు, పశ్చిమగోదావరిలో భీమవరం, విశాఖపట్నంలో గాజువాక, చిత్తూరు లో తిరుపతి వంటి స్థానాలను గట్టిగా కోరే అవకాశం ఉందని చెబుతున్నారు. వీటితో పాటు ఆ పార్టీ బలంగా ఉన్న ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేనకు ఎక్కువ సీట్లు ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. తెనాలి నుంచి జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు పొత్తులో భాగంగా ఇవ్వాల్సి ఉంటుందని ఇప్పటికే టిడిపి నేతలు ఒక అంచనాకు వచ్చారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి టిడిపి ఇంతవరకు ఇన్‌ఛార్జిని నియమించలేదు. ఈ సీటును జనసేన నుంచి పోతిన మహేష్‌కు ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. రాజమండ్రి సీటు కందుల దుర్గేష్ కు ఇవ్వొచ్చని తెలిసింది. జనసేనకు సీట్లు సర్దుబాటు చేసిన స్థానాల్లో ఉన్న టిడిపి అభ్యర్థులను లోక్‌సభకు పంపించాలని ప్రణాళిక వేసుకున్నట్లు తెలిసింది.

ప్రముఖ ఇటాలియన్ తత్వవేత్త ఆంటోనియో నెగ్రీ మృతి

పారిస్ : ప్రముఖ ఇటాలియన్ తత్వవేత్త ఆంటోనియో నెగ్రీ (టోనీ, 60) మరణించారు. శనివారం పారిస్‌లోని నివాసంలో మరణించినట్లు ఆయన భార్య, తత్వవేత్త జుడిత్ రెవెల్ సోమవారం ప్రకటించారు. సైద్ధాంతిక రచనలతో పాటు కార్మిక ఉద్యమాలలో చురుగ్గా పాల్గొనేవారు. కార్మికుల కోసం Potere Operaio (వర్కర్స్ పవర్) సంస్థను స్థాపించారు. నెగ్రీ రచించిన పుస్తకం ఎంపైర్ (ఎంపైర్) పలు విమర్శలను ఎదుర్కొంది. నెగ్రీ ఆగష్టు 1, 1933న ఇటలీలోని పాడువాలో జన్మించాడు. అతను పాడువా మరియు పారిస్ విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్. నెగ్రీ 1956లో ఇటాలియన్ సోషలిస్ట్ పార్టీలో సభ్యుడయ్యాడు. 1969లో 'పొట్టెరె ఒపెరాయో' అనే రాజకీయ సమూహంలో చేరాడు. స్థాపించబడింది 1973లో స్థాపించిన ఈ సంస్థ అనంతరం రద్దు చేయబడింది. తీవ్రవాద సంస్థ రెడ్ బ్రిగేడ్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై నెగ్రీని అరెస్టయ్యాడు. 1978లో క్రిస్టియన్ డెమొక్రటిక్ పార్టీ నాయకుడు ఆల్డో మోరోను కిడ్నాప్ చేసి హత్య చేయడంతో సహా అనేక ఆరోపణలపై 13 సంవత్సరాలకు పైగా జైలు శిక్ష అనుభవించారు.

యువతకు భరోసానిచ్చేందుకే 'యువగళం'

(మొదటి పేజీ తరువాయి)

3132 కిలోమీటర్లు సాగి విశాఖలోని అగనంపూడి శివాజీనగర్ వద్ద ముగిసింది. అక్కడ ఏర్పాటు చేసిన పైలాన్‌ను కార్యకర్తల నడుమ లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసమర్థుడు గద్దెనెక్కి ప్రజాస్వామ్యంపై చేసిన దాడి, వ్యవస్థల విధ్వంసాన్ని తాను కళ్లారా చూశానని జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. భవిష్యత్తుపై ఆశలు కోల్పోయిన యువతకు యువగళం యాత్ర భరోసానిచ్చిందన్నారు. అందరి సహకారంతో ఈ సుదీర్ఘ యాత్ర సాగించినట్టు వెల్లడించారు.పాదయాత్రలో తాను ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉంటానన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వాటిని నెరవేరుస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు అంగీకరించేది లేదని స్పష్టం చేశారు.

ప్రజలను పలకరిస్తూ.. ఉత్సాహంగా చివరి రోజు యాత్ర

ఉక్కునగరంలోని సిడబ్ల్యుసి-1 నుంచి యువగళం పాదయాత్ర సోమవారం ఉదయం ప్రారంభమైంది. పాదయాత్రకు ముందు నారా భువనేశ్వరి, పార్టీ నాయకులతో లోకేష్ కాసేపు చర్చలు జరిపారు. టిడిపి, జనసేన నాయకులు పల్లా శ్రీనివాసరావు, కోన తాతారావులు పాదయాత్రలో పాల్గొన్నారు. నెహ్రూ పార్కు, తెలుగు తల్లి విగ్రహం, వై.జంక్షన్, గంగవరం పోర్టు, చినగంట్యాడ, జగ్గు జంక్షన్, వడ్లపూడి, కూర్మన్నపాలెం మీదుగా యాత్ర అగనంపూడి వరకూ సాగింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకోవాలని, సొంత గనులు కేటాయించాలని పలువురు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. గంగవరం పోర్టు నిర్వాసితులు, ఉద్యోగులు, టూ వీలర్ మెకానిక్‌లు తమ కష్టాలను లోకేష్‌కు చెప్పుకొచ్చారు. న్యాయవాదులు, కాంట్రాక్ట్ కార్మికులు, అగ్రిగోల్డ్ బాధితుల నుంచి లోకేష్ వినతులు స్వీకరించారు. అగనంపూడి పైలాన్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తన ప్రసంగాన్ని కొనసాగించారు. చివరి రోజు యాత్రలో లోకేష్ వెంట తల్లి నారా భువనేశ్వరి, అత్త నందమూరి వసుంధరా దేవి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ అధ్యక్షులు కిమిడి కళావెంకట్రావు, ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త ప్రత్తిపాటి పుల్లారావు, నాయకులు శ్రీభరత్, కొల్లు రవీంద్ర, అమర్‌నాథ్ రెడ్డి, టిడి.జనార్ధన్, వంగలపూడి అనిత, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు. లోకేష్ యాత్రకు చివరి రోజు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది.

యువగళం ముగింపు సభకు 5 ప్రత్యేక రైళ్లు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువగళం ముగింపు సభకు ఐదు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తెలిపారు. నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర ప్రజల మద్దతుతో విజయవంతమైందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20న విజయనగరం జిల్లా పోలిపల్లిలో ముగింపు సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సభకు హాజరయ్యేందుకు ప్రజలు, కార్యకర్తలు, అభిమానుల కోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 5 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ రైళ్లు 19న ఆయా ప్రాంతాల నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. చిత్తూరు నుంచి ఉదయం 11 గంటలకు, తిరుపతి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు, రైల్వే కోడూరు నుంచి ఉదయం 7 గంటలకు, ధర్మవరం నుంచి ఉదయం 7 గంటలకు, నెల్లూరు నుంచి రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతాయని వివరించారు.

కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు

- వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను ప్రవేశపెట్టినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్యారోగ్య రంగంలో గణనీయమైన మార్పులను నాంది పలుకుతూ ఆరోగ్యశ్రీ అమలుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులు లబ్ధిదారుని ఫొటో, కుటుంబ యజమాని పేరు, ఫోన్ నెంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుతో పొందుపరిచిన ఆరోగ్య సమాచారం, ప్రత్యేకమైన ఎబిహెచ్ఎ ఐడితో కూడిన వివరాలు అందులో పొందుపరిచి ఉంటాయని అన్నారు.

తెలంగాణ విద్యుత్ బకాయిలపై సుప్రీంలో ఎస్ఎల్‌పి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జెన్‌కో బోర్డు సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ బాధ్యతను జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగించాలని నిర్ణయించారు. రాష్ట్రానికి బకాయిలు వెంటనే చెల్లించాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం ఆ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించడం, హైకోర్టు కేంద్ర ఆదేశాలపై స్టే ఇవ్వడం విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల వల్ల రాష్ట్రానికి రావాల్సిన వేల కోట్ల రూపాయల మొత్తం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించింది.

పనిచేసే ప్రదేశాల్లో విద్యుత్ పొదుపు

- డిఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మనం నివసిస్తున్న ఇంటితోపాటు పని ప్రదేశాల్లో ఇంధన పొదుపు పాటించాలని, అందుకోసం అవసరమైన, సమర్థవంతమైన పద్ధతులు అవలంబించాలని విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజరు నరేంద్ర ఎ పాటిల్ పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 21 వరకు జరుగుతున్న ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బందితో డిఆర్ఎం ఇంధన పొదుపు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పొదుపు ద్వారా స్థిరమైన భవిష్యత్తును నిర్మించే దిశగా ముందుకు సాగవచ్చన్నారు. రైల్వే వర్క్‌షాపుల సెక్టారులో నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు-2023కి వ్యాగన్ వర్క్‌షాపునకు మొదటి బహుమతి రావడం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకోవడం పట్ల సిబ్బందికి డిఆర్ఎం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం డి శ్రీనివాసరావు, ఎడిఆర్ఎమ్ ఆపరేషన్స్ ఎం శ్రీకాంత్‌తోపాటు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు పాల్గొన్నారు.

కళాకారులు, వృద్ధులకు రైల్వే రాయితీలు పునరుద్ధరించండి

- ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కళాకారులు, వృద్ధులకు రైల్వే ప్రయాణ ఛార్జీల్లో గతంలో ఇచ్చిన మాదిరిగానే రాయితీలను పునరుద్ధరణ చేయాలని కేంద్రాన్ని వైసిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. కళాకారులు, సీనియర్ సిటిజన్లకు కీలకమైన ఆర్థిక ఉపశమనాన్ని అందిస్తూ, ప్రస్తుతం ఉన్న సస్పెన్షన్‌ను పునఃపరిశీలించాలని రైల్వే మంత్రిని కోరారు. నృత్యం, సంగీతం, నాటకాలు వంటివి ప్రదర్శించే కళాకారులు, 50-75 శాతం రాయితీని పొందారు. ఇందులో సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్‌లలో 75 శాతం రాయితీ, 1వ తరగతికి 50 శాతం రాయితీ, ఎసి చైర్‌కార్, 3 ఎసి, 2 ఎసి ఉన్నాయని తెలిపారు. రాబోయే 26 జనవరి వేడుకలు, ఇతర ముఖ్యమైన సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రదర్శనలు ఉన్న నేపథ్యంలో ఈ రాయితీలను పునరుద్ధరించడం చాలా కీలకం అని అన్నారు.

కడప జిల్లాకు చెందిన కండక్టర్లను అక్కడికే బదిలీ చేయండి

- ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న కడప జిల్లాకు చెందిన కండక్టర్లందరినీ అక్కడికే బదిలీ చేయాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. ఈ మేరకు ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డిని సోమవారం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా వున్నప్పుడు భర్తీ చేసిన కడప జిల్లాకు చెందిన 287 కండక్టర్లు ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. 14 ఏళ్లుగా ఇతర జిల్లాల్లోనే పనిచేస్తున్న వారిని కడప జిల్లాకు బదిలీ చేయాలని కోరారు

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

నెల్లూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఉద్యోగ భద్రత, కనీస వేతనం కోసం

'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మ్యాండేస్ విధానం రద్దు చేయాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం ఆందోళన బాట పట్టారు. ఏపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు చేపట్టారు. అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ... ఫీల్డ్ అసిస్టెంట్లకు 17 ఏళ్ల సర్వీసును గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం గుర్తించిన పనులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వీరికి మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఏపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం అమల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జనవరి 6న చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద, కాకినాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు.

బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరందామయ్య మాట్లాడారు. ప్రమాదాల్లో చనిపోతే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఇటీవల మున్సిపాలిటీలో విలీనమైన గ్రామపంచాయతీలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్, చింతూరు ఐటిడిఎ వద్ద ఆందోళనలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నిరసన ర్యాలీ చేపట్టి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నెల్లూరులోని విఆర్‌సి క్రీడా మైదానం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. తమ శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మిర్చి పైరును ధ్వంసం చేసి వైసిపి జెండా పాతారు

పల్నాడు జిల్లాలో దుండగుల దుశ్చర్య

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

రాజకీయ కక్షలు వ్యవసాయానికి పాకాయి. వైసిపి-టిడిపి విభేదాల కారణంగా మిర్చి పైరును ధ్వంసం చేశారు. టిడిపి నాయకులకు చెందిన మిరప పంటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో వైసిపి జెండాలు పాతారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా వినుకొండ మండలంలో సోమవారం వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగడ్డకు చెందిన టిడిపి గ్రామ అధ్యక్షులు బోడెపూడి వీరాంజనేయులు సోదరి వనజాక్షి తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో మిర్చి పంట సాగు చేశారు. మరో 20 రోజుల్లో పంట కోతకు వస్తుందనగా గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి మొక్కలను ధ్వంసం చేసి, పొలంలో వైసిపి జెండాలు పాతారు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతులు గమనించి వెంటనే వనజాక్షి, వీరాంజనేయులుకు సమాచారం ఇచ్చారు. పొలాన్ని చూసి బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. రాజకీయ కక్షతో, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రోద్బలంతోనే ఇది జరిగిందని ఆరోపించారు. గతంలో వినాయకచవితి సందర్భంగా విగ్రహం ఊరేగింపు రోజున వైసిపికి చెందిన వారు కవ్వింపు చర్యలకు పాల్పడి తమపై దాడులు చేయడమే కాకుండా తమ కుటుంబీకులు 16 మందిపై అక్రమ కేసులు పెట్టారని, ఇప్పుడు ఎకరం మిర్చి పంటను ధ్వంసం చేశారని వాపోయారు. తాము ఆదివారం రాత్రి వరకూ పొలంలోనే ఉన్నామని, వైసిపి నాయకులు గతంలో పెట్టిన కేసు విషయంలో కోర్టు వాయిదాకు వెళ్లాల్సి ఉందని, దీన్ని అదునుగా చేసుకొని ఆ పార్టీ వాళ్లే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై వినుకొండ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పంట ధ్వంసాన్ని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు ఓ ప్రకటనలో ఖండించారు. ఈ దుర్మార్గానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పైరును ధ్వంసం చేసిన పొలంలో వైసిపి జెండా

వివేకా హత్య కేసులో మలుపు

- సునీత, ఆమె భర్త, సిబిఐ అధికారి రాంసింగ్‌పై కేసు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వైఎస్ వివేకానంద హత్య కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. వివేక కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, కేసు దర్యాప్తు చేపట్టిన సిబిఐ అధికారి రాంసింగ్‌పై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకా హత్యకేసులో కొందరు తనను బెదిరిస్తున్నారని ఆయన పిఎ కృష్ణారెడ్డి గతంలో పులివెందుల కోర్టును ఆశ్రయించారు. హత్య కేసుకు సంబంధం లేని వారి పేర్లు చెప్పాలంటూ తనపై బలవంతం చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ శుక్రవారం పులివెందుల కోర్టు విచారించిందని, కేసును దర్యాప్తు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసి 2024 జనవరిలో సమర్పించాలని పులివెందుల అర్బన్ కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు వైసిపి లీగల్ అడ్వైజర్ లాయర్ ఓబుల్‌రెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు 352, 323, 330, 342, 348, 506, 195ఎ, 166ఎ(బి), 109 ఐపిసి ఆర్/డబ్ల్యు 156(3) సిఆర్‌పిసి కింద సిబిఐ అధికారి రాంసింగ్, వివేక కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డిలపై కేసు నమోదు చేశారని చెప్పారు.

కొత్త బస్సులు ఎక్కడ?

- కాలం చెల్లిన వాటితోనే ఆర్‌టిసి ప్రయాణం
- టెండర్లు ఖరారు చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా రవాణా రంగంలో దేశంలోనే ప్రత్యేకతను చాటుకుంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్‌ఆర్‌టిసి)ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. రాష్ట్ర విభజన నాటికి 13,000 బస్సులు కలిగి వున్న ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఇపుడు హైర్ బస్సులను కలుపుకున్నా 10,500 వున్నాయి. ఇందులో 2,600 వరకు హైర్ బస్సులు. సాధారణంగా ప్రతియేటా మొత్తం బస్సుల్లో సగటున 15 నుండి 20 శాతం పాత బస్సులను తొలగించి వాటి స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేసే పద్ధతికి స్వస్తి చెప్పి హైర్ బస్సులను తీసుకునేందుకే ఇప్పుడు ఆర్‌టిసి పరిమితమవుతోంది. ఈ ఐదేళ్ల కాలంలో ఎపిఎస్‌ఆర్‌టిసి సొంతంగా ఒక్క బస్సునూ కొనుగోలు చేయలేదు. కొత్త బస్సుల కొనుగోలును పూర్తిగా అటకెక్కించడంతో రోజురోజుకూ ఆర్‌టిసిలో కాలం చెల్లిన బస్సుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కొత్త బస్సులు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో కాలపరిమితి తీరిన బస్సులనే నడపాల్సిన పరిస్థితి ఆర్‌టిసిలో నెలకొంది. సాధారణంగా ఏ బస్సయినా సగటున 12 లక్షల కిలోమీటర్లు నడవగానే దాన్ని పూర్తిగా పక్కన పెట్టేయాల్సిన ఆర్‌టిసి ఇప్పుడు అలాగే నడుపుతోంది. 12 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులు దాదాపు 2,700 వున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుండి కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు కసరత్తు చేస్తున్నా.. టెండర్ల దశ కూడా దాటడం లేదు. ఆగస్టు నుండి అధికారులు అదిగో.. ఇదిగో.. అంటున్నారు తప్ప కొత్త బస్సులను తీసుకోవడం లేదు. డిసెంబరు చివరి నాటికి ఆర్‌టిసికి 1500 కొత్త బస్సులు వస్తాయని చెబుతూ వచ్చిన అధికారులు ఇపుడు 2024 ఏప్రిల్ నాటికి వస్తాయని చెబుతుండటంపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త బస్సుల కొనుగోలుకు పోకుండా మొత్తం హైర్ బస్సులతోనే ఎపిఎస్‌ఆర్‌టిసిలో సర్వీసులు నడిపేలా ప్రభుత్వం నిర్ణయాల పట్ల ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

టిడిపి, జనసేనది ప్యాకేజీల బంధం

- ఎపిటిపిసి ఛైర్మన్ రవిచంద్రారెడ్డి విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి, జనసేన.. ప్రజల కోసం కాకుండా ప్యాకేజీల కోసమే కలుస్తున్నట్లు మరోసారి బహిర్గతమైందని ఎపిటిపిసి ఛైర్మన్, వైసిపి అధికార ప్రతినిధి పి రవిచంద్రారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల జనసేనకు టిడిపి ఇస్తున్న ప్యాకేజీ సరిపోవడం లేదనే లోకేష్ పాదయాత్ర ముగింపు బహిరంగ సభకు హాజరయ్యేందుకు పవన్‌కల్యాణ్ నిరాకరించారని ఆరోపించారు. దీంతో చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగి పవన్‌కల్యాణ్‌తో ప్యాకేజీ చర్చలు జరుపుతున్నారని విమర్శించారు. టికెట్‌ల కేటాయింపునకు వచ్చేసరికి వీరి సంధి ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయని అన్నారు.

వైద్యం అందకుండా ప్యాకేజ్ పెంచితే ఉపయోగం ఏమిటి? : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రాణాపాయ స్థితిలో ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందనప్పుడు ప్యాకేజీ కింద రూ.25 లక్షలు పెంచినా? కోటికి పెంచినా? ఉపయోగం ఏమిటని టిడిపి ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామి ప్రశ్నించారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.1000 కోట్ల బకాయిలు చెల్లించకుండా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని దూరం చేసి ప్రచారార్భాటాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారని విమర్శించారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా దళితులను తిట్టడం, ఐటి ఉద్యోగస్తులను నిందించటం, తమ పార్టీపై వ్యతిరేకత వచ్చేటట్లుగా వైసిపి కార్యకర్త మన్విత్ కృష్ణారెడ్డి చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. టిడిపి నాయకునిగా వేషం వేయించిన సజ్జల భార్గవ్‌రెడ్డిపై సిఐడికి ఫిర్యాదు చేసినట్లు టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు.

ఆదాయం పెంచాల్సిందే!

- వివిధ శాఖలకు ప్రభుత్వం సూచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆదాయాన్ని పెంచితీరాల్సిందేనని వివిధ శాఖలకు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. సోమవారం ఆర్థికశాఖ నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు సూచన చేసింది. వాణిజ్య, అటవీ, ఎక్సయిజ్, రెవెన్యూ, పోలీస్ వంటి శాఖల అధికారులతో ఆదాయం పెంపు, ఆదాయం క్రమబద్ధీకరణ వంటి అంశాలపై ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఆర్థికశాఖకు చెందిన ఉన్నతాధికారులు విడివిడిగా భేటీ అయ్యారు. ప్రస్తుతం వస్తున్న ఆదాయం, పెంచడానికి ఉన్న అవకాశాలను చర్చించారు.వాణిజ్య పన్నుల శాఖపై జరిగిన చర్చలో పన్నుల రూపేణా వచ్చే ఆదాయాన్ని మరింత పెంచాలని, దీనికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుత పన్నుల లక్ష్యాలను నూరు శాతం సాధించడంతో పాటు, నూతన ఆదాయ మార్గాలను అన్వేషించాలని చెప్పారు. పాత బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మద్యం ద్వారా వస్తున్న ఆదాయంపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. ఇప్పటివరకు ఎంత ఆదాయం సమకూరింది, రానున్న కాలంలో ఎంత వచ్చే అవకాశాలున్నాయన్నది కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. కొత్తగా తీసుకువచ్చిన మద్యం పాలసీ వల్ల ఆదాయ ప్రయోజనాలు ఎలా ఉన్నాయన్నది కూడా చర్చల్లో భాగంగా వచ్చినట్లు సమాచారం. అటవీ సంపదపై వచ్చే ఆదాయం, పర్యాటక రంగంపై ఆదాయం వంటివాటిపైనా చర్చ జరిగింది. పోలీసు అధికారులతోకూడా ఆదాయ మార్గాలపై చర్చ జరగడం విశేషం. వాస్తవానికి ఆదాయవనరుల శాఖల్లో ఇప్పటివరకు పోలీసు శాఖ లేదు. అయినప్పటికీ ఈసారి మాత్రం ఆ శాఖతోనూ చర్చ జరిగినట్లు తెలిసింది.

2047 నాటికి స్వావలంబనే లక్ష్యం : గవర్నర్

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్ (తిరుపతి జిల్లా)

2047 నాటికి భారత్ మహాశక్తివంతమైన దేశంగా నిలవనున్నదని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సోమవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రియదర్శిని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులందరికీ అందేలా అవగాహన కల్పించడం ఈ యాత్ర లక్ష్యమన్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి, మాట్లాడుతూ.. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా తిరుపతి జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి ముందు 'మన సంకల్పం...వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి నగర పాలక సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, డిఆర్‌డిఎ, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాలు తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్‌లను గవర్నర్ సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి పొంది జీవన ప్రమాణాలను పెంపొందించుకుని ఆదర్శంగా నిలిచిన లబ్ధిదారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ భారతి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత తదితరులు పాల్గొన్నారు

విజయవాడ ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించండి

- ఎస్ఇ కార్యాలయాల ఎదుట విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం

తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తెలంగాణలో మాదిరి డైరెక్ట్ పేమెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపిఎస్‌పిడిసిఎల్, ఇపిడిసిఎల్, సిపిడిసిఎల్ ట్రాన్స్‌కో ఎస్ఇ కార్యాలయాల ఎదుట యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేపట్టారు. షిఫ్ట్ ఆపరేటర్లు, మీటర్ రీడర్లు, సెక్షన్ ఆపరేటర్లు, స్టోర్స్ పనిచేస్తోన్న హమాలీలకు కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. విజయవాడ గుణదలలోని ట్రాన్స్‌కో సూపరిటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సంస్థలోని కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 2022 పిఆర్‌సి ప్రకారం బేసిక్ వేతనాలు చెల్లించి ఎరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పెయిడ్ హాలీడేస్ వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కొత్తగా నియమితులైన షిఫ్ట్ ఆపరేటర్లకు, వాచ్‌మెన్లుగా పనిచేస్తూ షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమితులైన వారికి పాత ఆపరేటర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం ట్రాన్స్‌కో ఎస్ఇ, డిస్కం ఎస్ఇలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ ధర్నాలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తిరుపతిలో స్థానిక శ్రీనివాసపురంలోని ఎస్‌పిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కర్నూలులోని ఎస్‌సి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కడప విద్యుత్ భవన్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని, మిగతా వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎస్ఇ హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు ధర్నాను విరమించారు. విశాఖలోని గ్రీన్ పార్క్ ఎదురుగా ఉన్న ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఒంగోలులో ఆందోళన చేపట్టారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India BOI
చెంచుపేట బ్రాంచ్
గుంటూరు. ఫోన్: 08644-229244

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ తెలిపిన ఋణగ్రహీత/లు, వారి చట్టబద్ధమైన వారసులకు మరియు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ ఋణగ్రహీత/లు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణమును సకాలంలో తిరిగి చెల్లించలేదు. అనేక పర్యాయములు అడిగననూ/నోటీసులు పంపినా చెల్లించలేదు. కావున ఈ పత్రికాప్రకటన ద్వారా దిగువ మీకు తెలియజేయునది ఏమనగా తేది 28.12.2023, మధ్యాహ్నం 3.00 గం.ల లోగా బకాయి సొమ్ము, వడ్డీ & ఇతర ఖర్చులను కలిపి మొత్తంను బ్యాంక్‌కు చెల్లించి మీరు తాకట్టుగా ఉంచిన బంగారపు వస్తువులను విడిపించుకొనవచ్చును లేని యెడల సదరు బంగారు నగలను మా బ్యాంకు శాఖ ఆవరణలో "ఏది ఉందో అది అలాగే" అను ప్రాతిపదికన తేది. 28.12.2023, సా॥ 4.00 - 4.30 గం॥లకు బహిరంగ వేలము వేసి మీ పేరున ఉన్న బకాయిలు జమకట్టుకొనబడును. ఖాతాదారునికి ఎవరికైననూ బ్యాంకు వారి నోటీసులు అందని యెడల లేదా నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరగా తెలియజేయడమైనది. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారు మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది. వేలంలో పాల్గొనదల్చినవారు తప్పనిసరిగా బ్యాంకు నియమ నిబంధనలకు లోబడి బ్రాంచ్ మేనేజరు గార్కి షెడ్యూలు తేది/సమయంలోగా వారి KYC డాక్యుమెంట్లు మరియు ధరావత్తు రూ.5000/- సొమ్ము చెల్లించవలెను. వేలంలో హెచ్చు ధర పాడిన వారు 24 గంటలలోగా పూర్తి సొమ్ము చెల్లించి నగలను స్వాధీనం చేసుకొనవలెను లేనియెడల ధరావత్తు సొమ్మును కోల్పోవుదురు. ఆసక్తి ఉన్న వ్యక్తులు మాత్రమే వేలంలో పాల్గొనాలని మరియు మొత్తం బిడ్డింగ్ సమయంలో ఎవరైనా బిడ్డరు నామమాత్రంగా పాల్గొని, ఏ ఒక్క కోట్ చేయకపోతే, అటువంటి బిడ్డర్లు వారి ధరావత్తు సొమ్ము నుండి రూ.1000/- కోల్పోతారని, మిగిలిన మొత్తం మాత్రమే వాపసు చేయబడుతుంది. బ్యాంక్ యొక్క రిజర్వు ధర నుండి వేలం ప్రారంభమగును, బిడ్డర్లు వారి ఆఫర్ ధరను రూ.500/-ల గుణింపుతో హెచ్చించవలెను. వేలం నిలుపుదల చేయుటకు, పూర్తి/పాక్షికంగా రద్దు చేయుటకు గాని తేది/ప్రదేశం/సమయం మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు.

ఖాతా సంఖ్య	ఋణగ్రహీత పేరు	స్థూల బరువు	నికర బరువు	చెల్లించవలసిన మొత్తం బకాయి (రూ.లలో)	NPA తేది
864677610008143	పైడిపాముల కిషోర్	45.00	39.30	1,70,217.64/- + వడ్డీ, ఖర్చులు	28.08.2023

తేది.18-12-2023, ప్రదేశం:చెంచుపేట
సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
ఆంధ్రా Andhra
కార్పొరేషన్ Corporation
బెంజ్ సర్కిల్ శాఖ,
విజయవాడ-520010.
ఫోన్: 93267 16091

డిమాండ్ నోటీస్

13(2) ఆఫ్‌సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 54 ఆఫ్ 2002

1 ఋణగ్రహీత మరియు హామీదారు పేరు మరియు చిరునామా: 1) శ్రీమతి పెద్దిరెడ్డి విజయలక్ష్మి, భర్త: పెద్దిరెడ్డి శ్రీరామి రెడ్డి, 2) శ్రీ పెద్దిరెడ్డి శ్రీరామి రెడ్డి, తండ్రి: పెద్దిరెడ్డి లక్ష్మారెడ్డి, డి.నెం. 3-108-1, ఫ్లాట్ నెం.504, మల్లెముడి వారి వీధి, పిన్నమనేని హైట్స్, రామవరపాడు, విజయవాడ, కృష్ణా జిల్లా-521107. 3) శ్రీమతి పెద్దిరెడ్డి విజయలక్ష్మి, భర్త: పెద్దిరెడ్డి శ్రీరామిరెడ్డి, 4) శ్రీ పెద్దిరెడ్డి శ్రీరామి రెడ్డి, తండ్రి: పెద్దిరెడ్డి లక్ష్మారెడ్డి, డి.నెం. 52-1/11-1ఏ, వెటర్నరీ కాలనీ, గుణదల, విజయవాడ-520008.

ఋణ స్వభావం	మొత్తము (రూ.) లక్షలలో	తేది. 29-11-2023 నాటికి బకాయి మొత్తము (రూ.)
160930100006913	9,80,000/-	5,84,835/-
160930100025893	2,50,000/-	1,85,483/-
మొత్తం	12,30,000/-	7,70,318/-

డిమాండ్ నోటిసు తేది. 04-12-2023

స్థిరాస్తి వివరములు: ఆంధ్రప్రదేశ్-521107, కృష్ణాజిల్లా, గుణదల, రామవరప్పాడు గ్రామం, ఆర్.యస్.నెం.127/3లో మొత్తం 1512.22 చ.గ.లలో 30 చ.గ.లలో గల అవిభాజ్యపు మరియు అనిశ్చితపు వాటా, దగ్గరి డోర్.నెం.2-79, పిన్నమనేని హైట్స్, నాల్గవ అంతస్తులో 990 చ.అ.ల ప్లింత్ ఏరియా, 90 చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా మరియు అన్ని సులభ హక్కులతో ఫ్లాట్ నెం.504 ఈ దిగువ హద్దులలో డీడ్ ప్రకారం స్థలం హద్దులు **తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** కల్లెపల్లి బాపిరాజు గారి ద్వారా అమ్మిన ఆస్థి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** వీరమాచినేని రంగారావు గారి ద్వారా ఇతరులకు అమ్మిన ఆస్థి. **ఫ్లాట్ నెం.504 హద్దులు తూర్పు:** కారిడార్, **దక్షిణం:** ఓపెన్ టూ స్కై, **పడమర:** కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టూ స్కై.

అమ్మ / అయ్యా.
విషయం: మీరు బెంజ్‌సర్కిల్ శాఖ నుండి అనుభవించిన ఋణ సౌకర్యములను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ 13 (2) నోటిసు ప్రకారము - నిరర్థక ఆస్తిగా వర్గీకరించడమైనది.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా బెంజ్‌సర్కిల్ శాఖ వారి నుండి పొందిన ఋణమును బకాయి / వడ్డీ / ఇన్‌స్టాల్‌మెంట్ తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ది. 28-11-2023 తేదిన నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడింది. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు బకాయి చెల్లించుటలో విఫలమైనారు. మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. కావున మీ ఖాతాను ఎన్.పి.ఏ (నిరర్థక అస్థి) అయ్యింది.
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌క్స్‌ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఆర్డినెన్స్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన ఋణం రాబట్టుటకు + చార్జ్ చేయని వడ్డీ + ఇతర ఛార్జీలు + ముగింపు తేది వరకు జేబు ఖర్చులతో సహ ఈ నోటిసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన అస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేద అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది. మీరు పైన ఉదహరించిన బకాయిని 60 రోజులలో లోపల తిరిగి చెల్లించని యెడల బ్యాంకు వారు సదరు చట్టంలోని అన్ని హక్కులను ఉపయోగించి మరియు అమ్మకము జరిగిన తరువాత పూర్తి బకాయి చెల్లించుటలో విఫలమైన బ్యాంకు వారు కోర్టు ఆఫ్ లా/డెబ్ట్ రికవరి ట్రిబ్యూనల్ ద్వారా మిగిలిన బకాయిని చట్టరిత్యా వసూలు చేయబడును. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారము ఈ నోటిసు అందిన నుండి మీరు పైన చెప్పబడిన ఆస్తిని సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు, మరియు లావాదేవిలు జరుపరాదు, సదరు సెక్షన్ నిబంధనల అతిక్రమణ జరిగితే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
SARFAESI చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 04-12-2023
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

GRIHUM HOUSING FINANCE Apna Ghar. Apni Pehchan.
గ్రిహుమ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)
రిజిస్టర్డు ఆఫీసు: 602, 6వ అంతస్తు, జీరో వన్ ఐటి పార్కు, క్ర.సం. 79/1, గోరేపాడి, ముంధ్వా రోడ్, పూణా-411036.
బ్రాంచి ఆఫీసు యూనిట్: 2వ అంతస్తు, ప్లాట్ నం.16, డోర్ నం.40-6/2-16, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఎదురుగా, మోగల్‌రాజ్‌పురం, విజయవాడ 520010.
ఇ-వేలం-అమ్మకం ప్రకటన

షార్ఫసీ యాక్ట్ క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తుల అమ్మకం

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 మరియు 9తో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ది "యాక్ట్") క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తాకట్టుదారులు/హామీదారులుకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు గ్రిహుమ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అనునది, 17 నవంబర్ 2023 నుండి గ్రిహుమ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మారినది) (గతంలో మగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ మరియు ఒరిజినల్‌గా జిఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీ పేరున ఇన్‌కార్పొరేటెడ్) ఇందు తరుపరి పై కార్పొరేట్ / రిజిస్టర్ ఆఫీసు యొక్క సెక్యూర్డ్ క్రెడిటర్‌గా పేర్కొనబడును, చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు అనుసరించి, ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్ యొక్క రూల్ 8&9తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారిచేత స్వాధీనంచేసుకోబడినవి.

క్ర.సం	ప్రతిపాదన నం. కస్టమర్ పేరు(ఎ)	డిమాండ్ నోటీసు తేది & బకాయి మొత్తాలు (బి)	స్వాధీనతా స్వభావం (సి)	ఆస్తి వివరణ (డి)	రిజర్వు ధర (ఇ)	ధరావత్తు (రిజర్వుధరలో 10%)(ఎఫ్)	ధరావత్తు దాఖలుచేసిన తేది (జి)	బిడ్ పెంపుదల (హెచ్)	ఆస్తి పరిశీలన తేది& సమయం (ఐ)	వేలం తేది& సమయం (జె)	తెలిసిన రుణభారాలు/ ఒక వేళ ఏవేని కోర్టు విషయంలో
1	లోన్ నం. హెచ్ఎం/ 0053/హెచ్/18/100304, కొండేటి లూథెర్ స్యామ్‌సన్ (రుణగ్రహీత), గుండాలా వనిత రాణి (సహ-రుణగ్రహీత) కొండేటి వరుణ్ కుమార్ (సహ-రుణగ్రహీత)	నోటీసు తేది: 07.05.2022, రూ. 24,92,480.74పై.లు (రూపాయలు ఇరువై నాలుగు లక్షల తొంభైరెండు వేల నాలుగు వందల ఎనభై మరియు డెబ్బై నాలుగు పైసలు మాత్రమే) రియలైజేషన్ వరకు 14.00% వార్షికంతో వడ్డీతోపాటు 07.05.2022నాటికి చెల్లించాల్సినవి.	భౌతికం	కృష్ణా జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, పయకపురం, విజయవాడ లో గల శ్రీ లక్ష్మి నర్సింహా ఎన్‌క్లేవ్ లో 2వ అంతస్తులో ఫ్లాట్ నం.55, ఫ్లాట్ నం.ఎస్ఎఫ్-2 గల ఆర్ఎస్ నం.లు18/1, 19/2బి మరియు 19/2సి గల ఉమ్మడి ఏరియా, బాల్కనీ మరియు 80చ.అ.ల కార్ పార్కింగ్‌తోసహా 1021చ.అ.ల ప్లింత్ ఏరియా లో 2వ అంతస్తులో దానిలో ఫ్లాట్‌తోపాటు 223.66చ.గ.లు లేదా 187.00చ.మీ.లకుగాను 37చ.గ.లు లేదా 30.93చ.మీ.ల సైటు యొక్క సూచించని మరియు విడదీయలేని భాగంహక్కుల తాకట్టు ఆస్తి యొక్క మొత్తం భాగం.	రూ.23,41,002/- (రూపాయలు ఇరువై మూడు లక్షల నలభై ఒక వేల రెండు మాత్రమే)	రూ.2,34,100.20 పైసలు (రూపాయలు రెండు లక్షల ముప్పై నాలుగు వేల ఒక వందల ఇరువై పైసలు మాత్రమే)	02/01/2024 Before 5 PM	10,000/-	27/12/2023 (11AM – 4PM)	03/01/2024 (11 AM- 2PM)	నిల్

ఆసక్తిగల బిడ్డరుదారులు/ కొనుగోలుదారులు, బిడ్స్‌ను సమర్పించుటకు ముందే సెక్యూర్డ్ క్రెడిటర్ బ్రాంచినీ సందర్శించి, వేలంకు పెట్టు ఆస్తులను పరిశీలించి, అదనపు చార్జీలు, రుణభారాలు మరియు ఏదేని థర్డ్-పార్టీ ఇంటరెస్ట్‌పై స్వంతంగా విచారణ జరుపుకోవలెనుఅన్ని విధాలా వారు సంతృప్తిచెందవలెను. గెలుపొందిన బిడ్డరుదారుచే చెల్లించు మరియు అసెట్స్‌కు ఆస్తికి అటాచ్‌చేయబడిన ఏవేని ఇతర బకాయిలు మరియు ఆస్తి పన్ను, ఎలక్ట్రిసిటీ/నీటి బకాయిలు మరియు ఏవేని చట్టబద్ధమైన ఇతర బకాయిలను చెల్లించవలసి ఉంటుంది. ఆసక్తిగల బిడ్డరుదారులు, యాక్షన్ సర్వీస్ ప్రొవైడర్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, చిరునామా-ప్లాట్ నం.-68, 3వ అంతస్తు, గురుగాం, హర్యానా-122003, హెల్ప్‌లైన్ నంబరు: 7291981124 సపోర్ట్ ఇమెయిల్ ఐడి-.Support@bankeauctions.com. సంప్రదించు వ్యక్తి- వినోద్ చౌహాన్, ఇమెయిల్ ఐడి-delhi@c1india.com, సంప్రదించు నం.-9813887931 నుండి ఇ-బిడ్డింగ్ కొరకు ఏదైతే తప్పనిసరి, అడ్వాన్స్‌లో లాగిన్ ఐడి& పాస్‌వర్డ్ పొంది మరియు పోర్టల్‌తో వారంతట వారుగా రిజిస్టరుచేసుకొనుట ఆవశ్యకం. దయచేసి గమనించండి: ఆసక్తిగల బిడ్డరుదారులు ఇ-వేలం పై వారి నుండి మాత్రమే ఆన్‌లైన్ శిక్షణ పొందవచ్చును. ఆసక్తిగల కొనుగోలుదారు/ బిడ్డరుదారు ధరావత్తును ఎన్ఇఎఫ్‌టి/ ఆర్‌టిజిఎస్/ డిడి రూపంలో "పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్" ఖాతాలో, బ్యాంక్-ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ ఖాతా నం. 000651000460 మరియు ఐఎఫ్ఎస్‌సి కోడ్-ఐసిఐసి0000006, 20, ఆర్.ఎన్.ముఖర్జీ రోడ్-కోల్‌కత-700001 పేరున ఏదేని జాతీయ లేదా షెడ్యూలు బ్యాంకు నుండి తీసిన డిడి ద్వారా 02.01.2024న లేదా ముందుగా దాఖలుచేయవలసిందిగా కోరబడుచున్నది మరియు https://www.bankeauctions.com.వద్ద వారి పేరు రిజిస్టరుచేసుకొన్న తరువాత మరియు యూజర్ ఐడి& పాస్‌వర్డ్‌ను పొందిన తరువాత, సర్వీస్ ప్రొవైడర్ నుండి ఇ-వేలం ద్వారా ఉచితంగా శిక్షణ పొందవచ్చును. వెబ్‌సైట్ పై వారి రిజిస్ట్రేషన్ తరువాత, ఆసక్తిగల కొనుగోలుదారు/ బిడ్డరుదారు దిగువ పత్రాల కాపీలను అప్‌లోడ్‌చేయవలెను, అవి ఇ-మెయిల్ & స్వంత ధృవీకరణ హార్డు కాపీని చిరునామా: 2వ అంతస్తు, ప్లాట్ నం.16, డోర్ నం.40-6/2-16, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఎదురుగా, మొగల్‌రాజ్‌పురం, విజయవాడ-520010, మొబైల్ నం. +91 8588802671 మరియు +91 9567626050 ఇ-మెయిల్ ఐడి rahul.r1 @poonawallahousing.com..కు పంపవలసిందిగా కోరబడుచున్నది. ఇ-వేలంలో పాల్గొనుటలో నియమనిబంధనల పై తదుపరి వివరాలు కొరకు..https://www.bankeauctions.com & www.grihumhousing.com..ను సంప్రదించండి.
ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్-2002 యొక్క రూల్ 8(6) క్రింద రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ తాకట్టుదారు/ హామీదారులకు 15 రోజుల నోటీసుగా కూడా ఈ ప్రకటనను పరిగణించవలసిందిగా కోరబడుచున్నది.

ప్రదేశం: విజయవాడ
తేది: 19.12.2023
సం/- అధీకృత అధికారి,
గ్రిహుమ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరుగలది)

సంపాదకీయం

నిరుద్యోగ భారతం

ప్రధాని మోడీ, ఆయన పార్టీ బిజెపి వల్లె వేస్తున్న 'వికసిత భారత్'లో నిరుద్యోగం భయంకర స్థాయికి చేరుకుంది. ఈ కఠోర నిజం కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వశాఖ తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్)తో బహిర్గతమైంది. సదరు అధ్యయనం ప్రకారం దేశంలో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు కలిగిన గ్రాడ్యుయేట్లలో 13.4 శాతం మంది నిరుద్యోగంలో మగ్గుతున్నారు. దేశంలోకెల్లా అత్యల్ప నిరుద్యోగిత రేటు చండీగఢ్‌లో 5.6 శాతం కాగా ఢిల్లీలో 5.7 శాతం. అండమాన్ నికోబార్ దీవుల్లో అత్యధికంగా 33 శాతం నిరుద్యోగిత ఉంది. ఈ సర్వే ఫీల్డ్ వర్క్ జూన్ 2022 నుంచి జులై 2023 మధ్య జరిగింది. పదేళ్ల మోడీ ఏలుబడిలో దేశం నిరుద్యోగ భారతాన్ని ఆవిష్కరించిందనడానికి ఇంతకంటే వేరే సాక్ష్యాధారాలు అవసరం లేదు. ఈ కాలంలో నిరుద్యోగ సమస్య ఆందోళనకర స్థాయికి చేరుతోందని పలు అధ్యయనాలు ఘోషిస్తున్నాయి. కార్పొరేట్ దిగ్గజాల్లో ఒకరైన అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం ఈ మధ్య విడుదల చేసిన సర్వే మేరకు దేశంలో 25 ఏళ్లలోపు గ్రాడ్యుయేట్లలో 42.3 శాతం నిరుద్యోగులేనని తేల్చింది. ఉన్నత మాధ్యమిక విద్య పూర్తి చేసిన వారిలో 21.4 శాతం నిరుద్యోగులు. ప్రపంచ ఆర్థిక మాంద్యం వచ్చిన 2008 నుంచీ చూసుకుంటే కేంద్రంలో బిజెపి వచ్చాక నిరుద్యోగిత రేటు పెరిగిందని నేషనల్ శాంపిల్ సర్వే కుండబద్దలు కొట్టింది. 2023 అక్టోబర్‌లో నిరుద్యోగిత రేటు 10.05 శాతానికి చేరింది. ఇదీ బిజెపి పాలనలో దేశం వెలిగిపోతున్న దృష్టాంతం.

ప్రధాని అభ్యర్థిగా 2014 ఎన్నికల్లో యువతకు మోడీ ఇచ్చిన ప్రధాన హామీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు. తొమ్మిదిన్నరేళ్లల్లో ఒక్క కొత్త ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఇచ్చి ఉంటే నిరుద్యోగిత ఎందుకు కట్టలు తెంచుకుంటుంది? స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదాలు గాలిలో ఉన్నాయి. చివరికి ఎక్కడిదాకా వచ్చిందంటే, విధిలేక వీధుల వెంట పకోడీలు అమ్ముకునే పని కూడా ఉపాధి, ఉద్యోగం కిందికే వస్తుందనే స్థాయికి ప్రధాని, బిజెపి పెద్దలు భాష్యాలు చెప్తున్నారు. ఈ చర్య నిరుద్యోగులను అపహాస్యం చేయడమే. ఇప్పటి వరకు రైతుల, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యల గురించే విన్నాం. ప్రస్తుతం నిరుద్యోగుల ఆత్మహత్యలూ సంభవిస్తున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో గణాంకాలు తెలుపుతున్నాయి. దేశాన్ని ముందుకు నడిపించాల్సిన యువత ఉపాధి లేక నిరాశ నిస్పృహలతో బలవన్మరణాలకు పాల్పడటం సమాజానికి చేటు. దేశ జనాభాలో 35 ఏళ్ల లోపు యువత 66 శాతం ఉంటుందని ఒక అంచనా. కోట్లాదిగా ఉన్న వీరికి ఉద్యోగ, ఉపాధి లేకపోతే బిజెపి ప్రచారం చేసుకునే 'అచ్చేదిన్' ఎలా?

మోడీ ఎంచుకున్న నయా ఉదారవాద విధానాలు ఉపాధి రహిత భారతాన్ని నిర్మిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని బిజెపి సర్కారు సుతరాం అంగీకరించదు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతోంది. లాభాల్లో ఉన్న వాటిని కూడా కార్పొరేట్లకు అప్పనంగా ధారాదత్తం చేస్తోంది. దాంతో కొత్త ఉద్యోగాలేమోకానీ, ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద రవాణా వ్యవస్థ రైల్వేలో రెండు లక్షలకుపైన ఉద్యోగాలు నియామకాల్లేక ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. పిఎల్ఎఫ్ఎస్ తాజా రిపోర్టు ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగిత రేటు 24 శాతం. జాతీయ సగటు కంటే మన రాష్ట్రంలో చాలా ఎక్కువ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. 'బీమార్' రాష్ట్రాలుగా పేర్కొనే అత్యంత వెనకబడ్డ రాష్ట్రాల కంటే ఎ.పి.లో నిరుద్యోగిత అధికంగా ఉండటం మన రాష్ట్ర ప్రజలను, యువతను కలవరపరిచే విషయం. విభజిత రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, కడప ఉక్కు, పోర్టులు, ఇతర మౌలిక అభివృద్ధి ప్రాజెక్టులను మోడీ సర్కారు ఇవ్వకుండా ద్రోహం చేస్తోంది. గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు అడగట్లేదు. ఈ రాష్ట్రంలో నిరుద్యోగానికి మొదటి దోషి బిజెపి అయితే రెండవ దోషి ఇక్కడ ఏలిన, ఏలుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలంటే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు మారాలి. విధానాల మార్పు పోరాటాలతోనే సాధ్యం. ఈ తర్కాన్ని యువత గ్రహించాలి.

మహనీయుల మాట

మన లోపాలను
మనం తెలుసుకోవడం
అన్నింటికన్నా పెద్ద చదువు.

- మీర్జా గాలిబ్,
ప్రసిద్ధ కవి.

అవాస్తవాల ప్రచారం

నయా ఉదారవాదం ఓ పచ్చి అబద్ధాల పుట్టగా తయారైంది. అంతకు మునుపటి పరిస్థితితో-అంటే, ప్రభుత్వ నియంత్రణ కింద మార్కెట్ శక్తులు వ్యవహరించవలసి వచ్చిన కాలంతో-పోల్చితే, నయా ఉదారవాద కాలం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతున్నట్టు చిత్రించడానికే ఈ అబద్ధాల ప్రచారం సాగుతోంది. నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధిరేటులో ఎంత పెరుగుదల ఉందంటే దాని ఫలితంగా ప్రజానీకం మొత్తంగానే చాలా మెరుగైన పరిస్థితులలో జీవించగలుగుతున్నారు అని నమ్మించడమే ప్రధాన వ్యూహంగా ఈ ప్రచారం ఉంటోంది. అత్యధిక శాతం ప్రజలు పేదరిక స్థాయి నుండి బైటపడిపోయారంటూ ప్రచారం జరుగుతోంది. ఒక వీర ఔత్సాహికుడైతే ప్రస్తుతం మన దేశంలో కేవలం రెండే రెండు శాతం ప్రజలు మాత్రమే ఇంకా పేదరికంలో కొనసాగుతున్నారని ప్రకటించాడు కూడా!

ప్రభుత్వ నియంత్రణ కింద మార్కెట్ శక్తులు వ్యవహరించవలసి వచ్చిన పూర్వ కాలంలో (1990కి మునుపు) మన దేశం ఏమీ సిరి సంపదలతో తులతూగిపోలేదు, నిజానికి అప్పటి విధానాలను విమర్శించడంలో వామపక్షాలే ముందున్నాయి కూడా. కాని, అప్పటికన్నా ఇప్పుడు ప్రజల జీవన ప్రమాణాలు బాగా మెరుగుపడినట్టు నయా ఉదారవాదం చెప్పుకోవడం మాత్రం పూర్తిగా అవాస్తవం.

నయా ఉదారవాదం ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీస్తున్న వైనాన్ని (ప్రస్తుత ఫాసిస్టు తరహా ప్రభుత్వ హయాంలో మాత్రమే కాక అంతకు ముందరి ప్రభుత్వాల హయాంలో సైతం) ఇప్పుడు నేను ప్రస్తావించబోవడం లేదు. వ్యక్తి ప్రయోజనాలే కేంద్రంగా, స్వార్థమే పరమావధిగా సమాజం యావత్తూ వ్యాపించిన భావజాలం గురించీ ప్రస్తావించను, సంపదలను మరింత ఎక్కువగా పోగేసుకోవాలనే దురాశతో, పేదలంటే తీవ్ర ద్వేషంతో వ్యవహరించే సంపన్నులను సృష్టించిన వైనాన్నీ నేనిక్కడ లేవనెత్తబోవడం లేదు. మనం జీవిస్తున్న కాలంలో ఎన్నడూ కనీ వినీ ఎరుగనంత ఘోరంగా జాతి నిర్మూలన సాగుతూంటే, దానికి వ్యతిరేకంగా ప్రజానీకం తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయబూనినప్పుడు ఆ నిరసన ప్రదర్శనలకు ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే మీడియాలో ఎక్కడా కనీసమైన విమర్శ కూడా కనిపించనంతగా మన దేశ నైతిక ప్రమాణాలు పతనం అయ్యాయన్న సంగతినీ నేను చర్చించబోవడం లేదు. కేవలం ఆర్థిక సూచికలకు మాత్రం పరిమితం అవుతాను.

ప్రభాత్ పట్నాయక్

కొట్టవచ్చినట్టు కనిపించేదీ, విషాదభరితమూ అయిన ఆర్థిక సూచిక రైతుల ఆత్మహత్యలు. మూడు లక్షల మందికి పైగా రైతులు, వ్యవసాయ కూలీలు గత మూడు దశాబ్దాల కాలంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. స్వతంత్రం పొందిన తర్వాత మన దేశంలో ఇంతవరకూ ఇటువంటిది మనం చూడలేదు. ఈ ఆత్మహత్యలకు ప్రత్యక్ష కారణం రైతుల దుర్భర దారిద్ర్యం. ఆ పరిస్థితికి వారిని నెట్టినవి నయా ఉదారవాద విధానాలే. ఆ విధానాల అమలులో భాగంగానే రైతులకు ప్రభుత్వం మద్దతును ఉపసంహరించింది. వాణిజ్య పంటలకు అంతవరకూ ప్రభుత్వం మద్దతు ధర ఇస్తూ వచ్చింది. ఇప్పుడు దానిని రద్దు చేయడంతో ప్రపంచ మార్కెట్‌తో బాటు దేశీయంగానూ వాణిజ్య పంటల ధరలు ఒడిదుడుకులకు లోనయ్యాయి. పలువురు రైతులు దివాలా తీశారు.



ఆ తర్వాత 2017-18కి మళ్ళీ గణాంకాలు సేకరించారు. 2011తో పోల్చినప్పుడు ఆ గణాంకాలు ఎంత దారుణ స్థితిని సూచించాయంటే మోడీ ప్రభుత్వం ఆ గణాంకాలను మొత్తంగానే విడుదల చేయకుండా తొక్కిపెట్టింది. ఎంతో కొంతమేరకు ఆ గణాంకాల్లో బైటకు పొక్కినదానిని బట్టి లభించే వివరాలను చూస్తే 2011-12తో పోల్చితే 2017-18 నాటికి మరో తొమ్మిది శాతం మేరకు ప్రజల వినిమయ శక్తి తరిగిపోయింది. దానిని బట్టి కనీస స్థాయిలో ఆహారధాన్యాలు పొందలేకపోతున్నవారు గ్రామీణ ప్రాంతంలో 80 శాతానికి పెరిగారు.

1991కి, 2011కి మధ్య వ్యవసాయదారుల సంఖ్య కోటీ ఏభై లక్షల మేరకు తగ్గిపోయింది. కొందరు రైతులు కూలీలయ్యారు. మరికొందరు పట్టణాలకు వలసలు పోయి అక్కడ ఉపాధి వేటలో పడ్డారు. అంతకు పూర్వపు కాలంతో పోల్చితే నయా ఉదారవాద కాలంలో కొత్త ఉద్యోగాల కల్పన వేగం తగ్గిపోయింది. అంతకు పూర్వపు కాలంలో జిడిపి వృద్ధి రేటు చాలా తక్కువగా ఉండేది. మరోపక్కన వలస పాలన పుణ్యమా అని నిరుద్యోగమూ చాలా అధికంగానే ఉండేది. ఆ కాలంలో కొత్త ఉద్యోగాల కల్పన రేటు రెండు శాతంగా ఉండేది. అదే నయా ఉదారవాద కాలంలో (జిడిపి వృద్ధిరేటు బాగా పెరిగినా) కొత్త ఉద్యోగాల కల్పన రేటు ఒక్క శాతానికి పడిపోయింది. సగానికి సగం తగ్గిపోయింది. దాంతో నిరుద్యోగ సైన్యం విపరీతంగా పెరిగిపోతోంది. కనీసం జనాభా ఏ వేగంతో పెరుగుతోందో ఆ మేరకన్నా ఉపాధి కల్పనలో పెరుగుదల లేదు. సిఎంఐఇ అంచనా ప్రకారం గత ఐదేళ్ళ కాలంలో ఉన్న ఉద్యోగాల సంఖ్యలో ఏ పెరుగుదలా లేదు.

జిడిపి వృద్ధి రేటు పెరుగుతున్నా, ఉపాధి కల్పనలో పెరుగుదల లేకపోవడానికి కారణం ఉంది. కార్మికుల ఉత్పాదకత వృద్ధిరేటు వేగం ఈ కాలంలో బాగా పెరగడమే ఆ కారణం. నయా ఉదారవాద విధానాలతోబాటు దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర స్థాయిలో విదేశీ పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. ఆ పోటీని తట్టుకునే క్రమంలో కార్మిక వర్గపు ఉత్పాదకత వేగంగా వృద్ధి చెందింది. ఐతే ఆ వృద్ధికి తగ్గట్టు వారి ఆదాయాలు మాత్రం పెరగలేదు. ఒక కనీస స్థాయికి ఆ వేతనాలు కట్టడి చేయబడ్డాయి. దాంతో మిగులులో వారి వాటా తగ్గిపోయింది. ఆ విధంగా నయా ఉదారవాద విధానాల కాలంలో ఆర్థిక అసమానతలు బాగా పెరిగాయి. బడా పెట్టుబడిదారులతోబాటు ఒక చిన్న ఉన్నత మధ్యతరగతి వర్గం కూడా తన ఆదాయాలను బాగా పెంచుకోగలిగింది. వీరంతా ప్రస్తుతం నయా ఉదారవాదానికి గట్టి సమర్థకులుగా కొనసాగుతున్నారు.

థామస్ పికెటీ, లూకాస్ చాన్సెల్ అనే ఇద్దరు ఫ్రెంచి ఆర్థికవేత్తలు మన దేశంలో ఆదాయాలలోని అసమానతలను అంచనా కట్టారు. ఇందుకోసం వారు మన దేశ ఆదాయ పన్ను గణాంకాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. మొత్తం దేశపు జాతీయాదాయంలో అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనం తాలూకు వాటా ఎంత అన్నది లెక్క గట్టారు. 1982 నాటికి ఆ ఒక్క శాతం సంపన్నుల వాటా 6 శాతానికి తగ్గింది. అంటే ఆదాయాల్లో అసమానతలు తగ్గుతూ వచ్చాయన్న మాట. ఆ తర్వాత, ముఖ్యంగా నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలయ్యాక వారి వాటా పెరుగుతూ పోయింది. 2013-14 నాటికి వారి వాటా 22 శాతం అయింది. మన దేశంలో ఆదాయ పన్ను విధించడం మొదలైనది 1922లో. అప్పటి నుండీ చూస్తే ఇంత ఎక్కువ వాటా సంపన్నులకు ఇంతకు మునుపెన్నడూ లేదు. ఇదే మాదిరిగా తక్కిన దేశాల్లోనూ ఆర్థిక అసమానతలు పెరిగాయి. మిగులులో సంపన్నుల వాటా పెరుగుతోంది. అది అధికోత్పత్తి సంక్షోభానికి దారి తీసింది. నయా ఉదారవాద విధానాలు ముందుకు పోడానికి దారి లేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

కార్మికుల తలసరి నిజ ఆదాయాలలో పెరుగుదల లేకపోగా, ఉద్యోగులతో పోల్చినప్పుడు నిరుద్యోగుల నిష్పత్తి పెరుగుతూ పోతోంది. పని చేసేవారిలో పూర్తి ఉద్యోగులు, కొద్ది గంటలు లేదా నెలలో కొద్ది రోజులు మాత్రమే పని దొరుకుతున్నవారు, ఉన్న పనులు పోగొట్టుకుంటున్నవారు-ఇలా రకరకాలుగా ఉన్నారు. వీరిలో పూర్తి స్థాయిలో పని లభిస్తున్నవారి సంఖ్య సాపేక్షంగా తగ్గుతోంది గనుక సగటు తలసరి నిజ ఆదాయాలు పడిపోతున్నాయి. వారు తిరిగే రోడ్ల స్థితి మెరుగుపడింది. వీధిలైట్లు బాగా వెలుగుతున్నాయి. కాని వారికి ప్రాథమికంగా అత్యంత అవసరం అయిన ఆహారధాన్యాల లభ్యత మాత్రం తగ్గిపోతోంది. పేదరికం కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది.

1973-74 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని పేదరికాన్ని మన దేశంలో అధ్యయనం చేయడం ప్రారంభమైంది. పూర్తి స్థాయిలో పేదరికం నెలకొంది అని నిర్ధారించడానికి ఆ ప్రజలకు ఎంత శక్తినిచ్చే ఆహార దినుసులు లభిస్తున్నాయి అన్నది కొలబద్దగా ప్లానింగ్ కమిషన్ తీసుకుంది. గ్రామాల్లో తలసరి 2200 కేలరీలు, పట్టణాల్లో 2100 కేలరీలు ప్రమాణంగా తీసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వాలు, ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు ఈ ప్రమాణాన్ని నీరుగార్చడానికి చాలా కుట్రలు సాగిస్తూ వచ్చాయి. తద్వారా దేశంలో పేదరికం తగ్గిపోయిందంటూ చిత్రించ ప్రయత్నించాయి. కాని ఇప్పుడు మనం మాత్రం ఈ ప్రాథమికమైన నిర్వచనానికే కట్టుబడదాం.

1973-74లో తలసరి 2200 కేలరీల శక్తినిచ్చే ఆహారం పొందలేకపోయినవారు 56.4 శాతం గ్రామీణ జనాభా. తలసరి 2100 కేలరీల శక్తినిచ్చే ఆహారం పొందలేకపోయిన పట్టణ జనాభా 49,2 శాతం. 1993-94 వచ్చేసరికి అది గ్రామాల్లో 58 శాతానికి (స్వల్ప పెరుగుదల) పట్టణాల్లో 57 శాతానికి (ఇది కాస్త ఎక్కువ పెరుగదల)పెరిగింది. అప్పటికి దేశంలో నయా ఉదారవాద విధానాల అమలు మొదలైంది. 2011-12 నాటికి చూస్తే గ్రామీణ ప్రాంతాల్లో 68 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 65 శాతానికి పెరిగింది.

ఆ తర్వాత 2017-18కి మళ్ళీ గణాంకాలు సేకరించారు. 2011తో పోల్చినప్పుడు ఆ గణాంకాలు ఎంత దారుణ స్థితిని సూచించాయంటే మోడీ ప్రభుత్వం ఆ గణాంకాలను మొత్తంగానే విడుదల చేయకుండా తొక్కిపెట్టింది. ఎంతో కొంతమేరకు ఆ గణాంకాల్లో బైటకు పొక్కినదానిని బట్టి లభించే వివరాలను చూస్తే 2011-12 తో పోల్చితే 2017-18 నాటికి మరో తొమ్మిది శాతం మేరకు ప్రజల వినిమయ శక్తి తరిగిపోయింది. దానిని బట్టి కనీస స్థాయిలో ఆహారధాన్యాలు పొందలేకపోతున్నవారు గ్రామీణ ప్రాంతంలో 80 శాతానికి పెరిగారు (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రిసెర్చ్‌కి ఉత్సా పట్నాయక్ తాజాగా సమర్పించిన నివేదిక 'ఎక్స్‌ప్లోరింగ్ ది పావర్టీ క్వశ్చన్' నుండి)!

ప్రపంచ ఆకలి సూచికలో ఉన్న 125 దేశాలకు గాను మన దేశం 111వ స్థానంలో ఉండడం ఆశ్చర్యం కలిగించేదేమీ కాదు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాలకన్నా మనం ఆ సూచికలో వెనుకబడ్డాం.

దేశం మొత్తం మీద తలసరి ఆహారధాన్యాల లభ్యతకు సంబంధించిన గణాంకాలతో సరిపోల్చినా పై గణాంకాలు సరైనవేనని స్పష్టపడుతుంది. బ్రిటిష్ ఇండియాలో తొలి కాలంలో తలసరి ఆహార ధాన్యాల లభ్యత 200 కిలోలు. అది కాస్తా క్రమంగా తగ్గుతూ స్వతంత్రం వచ్చేనాటికి 138 కిలోలకు దిగజారింది. ఈ దిగజారుడును అరికట్టి మెరుగుదల సాధించడానికి 1980 దశకం దాకా సమయం పట్టింది. అప్పటి నుంచీ తలసరి ఆహార ధాన్యాల లభ్యత దాదాపుగా స్థిరంగా ఒకే స్థాయిలో కొనసాగుతోంది. దేశంలో సంపన్నులు స్వీకరించే ప్రాసెస్డ్ ఫుడ్స్ వాటా పెరుగుతోంది. మరోపక్క కోళ్ళు, పందులు, తదితర పశువులకు మేత రూపంలో ఖర్చు చేసే ఆహారధాన్యాల వాటా కూడా పెరుగుతోంది. దానిని బట్టి తక్కిన జనాభా వాటా తరుగుతోంది అని చెప్పవచ్చు.

అందుచేత ఏ విధంగా చూసుకున్నా పూర్తి స్థాయి పేదరికం లోకి దిగజారిపోతున్నవారి నిష్పత్తి పెరుగుతూనే వుంది. ప్రభుత్వ నియంత్రణలో మార్కెట్ ఉన్న కాలంలో తగ్గుతూ వచ్చిన పేదరికం నయా ఉదారవాద కాలంలో పెరుగుతూ పోతోంది.

నయా ఉదారవాదాన్ని సమర్థించే బాకారాయుళ్ళు ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చుతున్నారు. అందుకోసం రకరకాల మోసపూరిత వాదనలను, వక్రీకరణలను ముందుకు తెస్తున్నారు. నయా ఉదారవాద కాలం అంటేనే అందరికీ సిరిసంపదలను అందించే కాలం అంటూ చిత్రిస్తున్నారు.

(స్వేచ్ఛానుసరణ)

ఏ విధంగా చూసుకున్నా పూర్తి స్థాయి పేదరికం లోకి దిగజారిపోతున్నవారి నిష్పత్తి పెరుగుతూనే వుంది. ప్రభుత్వ నియంత్రణలో మార్కెట్ ఉన్న కాలంలో తగ్గుతూ వచ్చిన పేదరికం నయా ఉదారవాద కాలంలో పెరుగుతూ పోతోంది. నయా ఉదారవాదాన్ని సమర్థించే బాకారాయుళ్ళు ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చుతున్నారు. అందుకోసం రకరకాల మోసపూరిత వాదనలను, వక్రీకరణలను ముందుకు తెస్తున్నారు. నయా ఉదారవాద కాలం అంటేనే అందరికీ సిరిసంపదలను అందించే కాలం అంటూ చిత్రిస్తున్నారు.

దేశం కోసం పిన్న వయసులోనే ప్రాణాలొదిలిన వీరుడు!

నివాళి

'నాకు ఏ కోరికా లేదు. ఉన్నదల్లా ఒకే ఒక్క కోరిక. నా శవాన్ని చుట్టే గుడ్డలో నా మాతృ భూమి తాలూకు మట్టిని కొంచెం పెడితే చాలు' అని చివరి కోరిక కోరుకున్న స్వాతంత్ర్య విప్లవవీరుడు షాహిద్-ఏ-ఆజాం అష్ఫాఖుల్లాఖాన్. ఈ మట్టి కోసం, ఈ ప్రజల కోసం ప్రాణం కంటే మిన్నగా దేశాన్ని ప్రేమించాడు. భగత్‌సింగ్ కంటే ముందే మా దేశ విముక్తి కోసం చిరునవ్వుతో ఉరితాడును పెళ్లితో ముడిపెట్టిన అసమాన ధైర్యశాలి. ఆయన ధైర్య సాహసాల గురించి ఆరోజుల్లో భగత్‌సింగ్ ఎంతగానో కొనియాడారు. అష్ఫాఖుల్లాఖాన్ నుంచి భగత్‌సింగ్ స్ఫూర్తి పొందాడు. అంతటి విప్లవ యువకిశోరం త్యాగచరిత్రను నేడు హిందూ మతోన్మాదులు మరచిపోయి ముస్లిమ్‌లపై అనేక రకాల దాడులు చేస్తున్నారు. ఈ దేశం వదలి పాకిస్తాన్‌కు వెళ్లిపొండి అంటున్నారు. అందుకే ఈ దేశ స్వాతంత్ర్యం కోసం, హిందూ-ముస్లిమ్‌ల ఐక్యత కోసం ఆరోజుల్లోనే అనేక రకాలుగా అష్ఫాఖ్ కృషి చేశారు. ఆయన లాంటి వీరుల చరిత్రను తెలుసుకోవడం ద్వారా, వారిని స్మరించుకోవడం ద్వారా మతోన్మాద శక్తులకు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా మరింత గట్టిగా పోరాడేందుకు అందరినీ కలుపుకుని ముందుకు సాగినపుడే అష్ఫాఖ్ నుంచి నిజమైన స్ఫూర్తి పొందిన వారమవుతాం.

నేడు అష్ఫాఖుల్లా ఖాన్ వర్ధంతి

ఉత్తరప్రదేశ్ లోని షాజహాన్‌పూర్‌లో విద్యావంతులైన జమీందారీ కుటుంబంలో మెహరున్నీసా బేగం, షఫీఖుల్లా ఖాన్ దంపతులకు 1900 అక్టోబర్ 22న అష్ఫాఖ్ జన్మించారు. కుటుంబంలో చివరివాడైనందున అత్యంత గారాబంగా పెరిగాడు. ఏడవ తరగతి చదువుతున్న దశలోనే బెంగాల్ విప్లవకారుల వీరోచిత సాహసాలు, ఖుదీరాంబోస్, కన్హయ్యాలాల్ లాంటి వీరుల ప్రాణత్యాగాల నుంచి ప్రేరణ పొందాడు. తను కూడా వారిలాగే మాతృభూమి విముక్తి కోసం పోరాడాలని నిర్ణయించుకున్నాడు. ఆనాటి విప్లవ కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్'తో సంబంధాల కోసం తీవ్రమైన ప్రయత్నాలు ప్రారంభించారు అష్ఫాఖ్. ఖిలాఫత్ ఉద్యమం అనంతరం హిందూ ముస్లిమ్‌ల ఐక్యతను దెబ్బ తీయడానికి సామ్రాజ్యవాదులు పన్నిన కుట్రల వల్ల హిందూ-ముస్లిమ్‌ల మధ్య కొన్ని అపోహలు, అపార్థాలు ఏర్పడ్డాయి. అందువల్ల ముస్లిమ్ యువకుడైన అష్ఫాఖుల్లా ఖాన్‌ను అసోసియేషన్ లోకి తీసుకునేందుకు రాంప్రసాద్ బిస్మిల్ విముఖత చూపాడు. అష్ఫాఖ్ పట్టు వదలకుండా వారు పెట్టిన పరీక్షలన్నిటి లోనూ నెగ్గి సంఘంలో ముఖ్య సభ్యునిగా ఎదిగాడు. 'నేను స్వేచ్ఛా స్వాతంత్ర్యం కలిగిన పూజారిని. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించడానికి సర్వదా సిద్ధం" అని ప్రకటించాడు. 'మాతృదేశ విముక్తి కోసం ఏం వచ్చినా ఎదుర్కొంటాను కానీ బాధపడను. ఈ దేశం కోసమే జీవిస్తాను, మరణిస్తాను' అని చాలా స్పష్టంగా తన జీవిత గమ్యాన్ని, లక్ష్యాన్ని నిర్దేశించుకున్న మహనీయుడు అష్ఫాఖుల్లాఖాన్.

1925 ఆగస్టు 9న కకోరీ సమీపంలో రైలులో తరలించబడుతున్న ప్రభుత్వ ఖజానాను దాడి చేసి దోచుకున్నారు. ఈ దాడిలో అష్ఫాఖుల్లాఖాన్, ఆజాద్, బిస్మిల్‌తో సహా 10 మంది విప్లవకారులు పాల్గొన్నారు. దేశ చరిత్రలో ఈ ఘటన కకోరీ కుట్ర కేసుగా నిలిచిపోయింది. బ్రిటిష్ ప్రభుత్వం ఏడుగురిని అరెస్టు చేశారు. అష్ఫాఖ్ అజ్ఞాతం లోకి వెళ్లిపోయారు. ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు అష్ఫాఖ్‌ను పట్టుకున్నారు. ఈకేసు విచారణ జరిపి కోర్టు ఉరిశిక్ష విధించింది. అష్ఫాఖుల్లాఖాన్‌ను 1927, డిసెంబర్ 19న ఉరి తీయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆయనను ఫైజాబాద్ జైలుకు తరలించారు. ఆయనకు జైలులో భగత్‌సింగ్‌తో పరిచయమైంది. ఉరితీయడానికి ముందురోజు అష్ఫాఖుల్లాఖాన్ బాగా ముస్తాబై ఎంతో ఉత్సాహంగా నవ్వుతూ ఇలా అన్నాడు 'రేపే నా పెళ్లి. నా పెళ్లి చేయాలని మా వాళ్లెంతో ప్రయత్నించారు. నాకు నచ్చిన వధువు దొరక్క చేసుకోలేదు. ఇన్నాళ్లకు ఇదిగో నాకు నచ్చిన వధువు దొరికింది' అంటూ ఉరిశిక్షను వధువుతో పోల్చి ఉత్సాహంగా ఉరికంబం ఎక్కిన విప్లవకారుడు. ఆయన ధైర్యసాహసాలు, త్యాగనిరతి ఆశ్చర్యానికి గురి చేసిందని భగత్‌సింగ్ రాసుకున్నారు.

1927, డిసెంబర్ 19న ఉరి వేదిక ఎక్కి ముందుకు నడిచి ఎంతో ధైర్యంతో ఉరితాడును చిరునవ్వుతో ముద్దాడాడు. స్వతంత్ర భారత దేశం ఏ విధంగా ఉండాలన్న విషయంలో అష్ఫాఖుల్లాఖాన్ చాలా స్పష్టమైన అభిప్రాయాలను కలిగి ఉన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఎటువంటి అసమానతలకు చోటు ఉండరాదని ఆయన ఆకాంక్షించారు. ఆర్థిక అసమానతలు, సాంఘిక అంతరాలు, ఏ రకమైన దోపిడీ లేని సమాజాన్ని ఆశించారు. సమ సమాజానికి అధిక ప్రాముఖ్యత ఇచ్చిన అష్ఫాఖ్ హిందూ, ముస్లిముల ఐక్యతకు అంతటి స్థానం కల్పించారు. మౌలానా అబ్దుల్ కలాం స్థాయిలో హిందూ-ముస్లిమ్‌ల ఐక్యతకు ప్రతీకగా నిలిచారు. దేశంలో మతం పేరిట జరుగుతున్న సంఘటనలు, పాలక వర్గాల కుట్రలన్నిటిపై హెచ్చరించారు. 'మత మార్పిడి సంస్థ ఏడు కోట్ల మంది ముస్లిములను హిందువులుగా, 22 కోట్ల మంది హిందువులను ముస్లిములుగా మార్చగలదా?' అని నాడే ప్రశ్నించాడు అష్ఫాఖ్. బానిసలుగా బతుకుతున్న వారికి మతమేమిటన్నారు. భారతీయులు బానిసత్వం నుంచి బయట పడాలని, మత విభేదాలను మరచి సమైక్యం కావాలని ఆరోజే పిలుపునిచ్చారు. ప్రజలందరూ ఐక్యమై విదేశీ పాలకులతో పోరాడాలని కోరారు. 'భారతదేశ పౌరులారా! మీరు ఏ మతానికి, సంప్రదాయానికి చెందిన వారైనా సరే దేశసేవలో సహకరించండి. వృథాగా పరస్పరం కలహించుకోకండి. ఒకవేళ దారులు వేరైనా అందరి లక్ష్యం ఒక్కటే. అన్ని పనులూ ఒకే లక్ష్యాన్ని సాధించేందుకే. అలాంటప్పుడు ఈ వ్యర్థపు కొట్లాటలు, కుమ్ములాటలు ఎందుకు? ఐకమత్యంతో దేశంలోని దొరతనాన్ని ఎదిరించండి. దేశాన్ని స్వతంత్రం చేయండి. నా సోదరులు సుఖంగా ఉందురు గాక!' అని 'చివరిగా అందరికీ నా సలాం...' అంటూ తన ప్రసంగం ద్వారా దేశభక్తులకు కర్తవ్యాన్ని బోధించారు. ఆయన ఈ దేశానికి సాధారణ స్వాతంత్ర్యాన్ని మాత్రమే కోరుకోలేదు. ఆర్థిక, సామాజిక అసమానతలు లేని మరో ప్రపంచాన్ని ఆయన కలలు కన్నారు. మతం పేరుతో మారణహోమం సృష్టిస్తున్న మతోన్మాద శక్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి. సమాజంలో మతతత్వ శక్తులు విజృంభిస్తున్నాయి. ప్రజల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకోవాలనే వారు శాంతియుత వాతావరణాన్ని చెల్లాచెదురు చేసి రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. ఒక మతాన్ని కించపరిచే విధంగా రాజకీయ నాయకులు ముందుకు పోతున్నారు. ముస్లిములు, దళితులు, మేధావులు, లౌకికవాదులపై అనేక రకాలుగా దాడులు చేస్తున్నారు. రాజ్యాంగ పరంగా ప్రతిజ్ఞ చేసిన వారే మతాన్ని కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు. ఏది తినాలో, ఏది తినకూడదో, ఏది మాట్లాడాలో, ఏది మాట్లాడకూడదో, ఏది రాయాలో, ఏది రాయకూడదో సైతం బిజెపి, ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి చెప్పినట్లు చేయాలనే నిబంధన తెచ్చి దేశాన్ని హిందూదేశంగా మార్చాలన్న కుట్ర జరుగుతోంది. దీన్ని ఎదిరించాల్సిన అవసరం ఉంది. ఉగ్రవాదం అంటే ముస్లిములు కారు. ముస్లిములు అంటే ఉగ్రవాదులు కారు. దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా వదలిన అష్ఫాఖుల్లాఖాన్ వారసులు ఈ దేశ ముస్లిములు. అదే స్ఫూర్తితో దేశం కోసం ఉద్యమిస్తాం... మతోన్మాదాన్ని ఈ దేశం నుంచి తరిమివేస్తాం... ఉద్యమిద్దాం.. అదే అష్ఫాఖుల్లాఖాన్‌కు మనమిచ్చే నిజమైన నివాళి.

- సంఘమిత్ర

కవిత్వం

హామీలంటే..!!?

హామీలంటే
ఎగిరి దుమికే జలపాతాలు కాదు
మాటిచ్చిన నాలిక
మడతెట్టకుండా నిలుపుకోవడం.
హామీలంటే
వాగ్దానాల మూటల్ని
ఎక్కడ పడితే అక్కడ కుమ్మరించడం కాదు
అడుగంటిన కుండకింత
బత్యం పోసి బతికించడం.
హామీలంటే
గాలి విసుర్లు విసిరేసి
భుజాలనెగరేస్తూ
మైకు పట్టి కూతలెయ్యడం కాదు
గాయపడ్డ దారికింత
మరమ్మతుల మందు రాయడం.
హామీలంటే
కళ్ళకు కొండంత చూపించి
గోరంత గిల్లి చేతిలో పెట్టి
పకపకా పళ్ళికిలించడం కాదు
మాసిపోయిన సగటు మెట్లను
తుడిచి పెట్టి దారి చూపించడం.
హామీలంటే
పైపూతల మెరుపుల్ని చిట్లించి
సహజత్వాన్ని
పాతాళంలోకి నెట్టివేయడం కాదు
సమసమాజపు నిర్మాణానికి
లోలోతుల నుండి పునాదులెయ్యడం.
హామీలంటే
బొమ్మ బొరుసుల్లా
అటు ఇటు ఆడే ఆట కానే కాదు
చీడ పట్టిన పాలనకింత ఔషధం రాసి
వ్యవస్థలో అవస్థలకు
చరమగీతాన్ని పాడి వినిపించడం.
హామీలంటే
ఒట్టి మాటల్ని
బుట్టలు బుట్టలుగా చల్లడం కాదు
గట్టు దాటకముందే
ఇచ్చిన మాటను
ధ్వజస్తంభంలా నిలబెట్టుకోవడం.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

27 నుంచి నీతి ఆయోగ్ సమావేశాలు

- రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 27 నుంచి నీతి ఆయోగ్ ఉన్నత స్థాయి సమావేశాలు జరగనున్నాయి. మూడు రోజులపాటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు (సిఎస్‌లు)తో నీతి ఆయోగ్ సమావేశాలు నిర్వహించనుంది. ఈ నెల 27 నుంచి 29 వరకు ఢిల్లీ పూసా ఇన్‌స్టిట్యూట్‌లో సమావేశాలు జరగనున్నాయి. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో మూడోసారి ప్రధాన కార్యదర్శుల కాన్ఫరెన్స్ జరగనుంది. అన్ని రాష్ట్రాల సిఎస్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రమణ్యం ప్రత్యేకంగా లేఖలు పంపారు. ఈ కాన్ఫరెన్స్‌కు వచ్చే ముందు... నీతి ఆయోగ్ కోరిన అంశాలపై అన్ని రాష్ట్రాలు నివేదికలు పంపాలని కోరింది. కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, అమలు తీరుతెన్నులపై సిఎస్‌లను నీతి ఆయోగ్ నివేదికలు కోరింది. కాన్ఫరెన్స్‌కు హాజరయ్యే కనీసం వారం రోజుల ముందుగా అయినా నివేదికలు పంపాలని నీతి ఆయోగ్ సూచించింది.

జ్ఞానవాపి మసీదు సర్వే నివేదిక అందజేత

లక్నో : జ్ఞానవాపి మసీదు కాంప్లెక్స్‌లో శాస్త్రీకంగా చేపట్టిన సర్వే నివేదికను పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు సోమవారం వారణాసి కోర్టుకు సమర్పించారు. హిందూ దేవాలయాన్ని కూల్చి వేసి, మసీదును నిర్మించారా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు సర్వే నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. 'నివేదికను సీల్డ్ కవరులో కోర్టుకు సమర్పించాం. ఆ నివేదికను న్యాయస్థానం 21వ తేదీన పరిశీలిస్తుంది' అని ఏఎస్ఐ న్యాయవాది అమిత్ శ్రీవాత్సవ చెప్పారు. నివేదికను సమర్పించేందుకు మరో వారం గడువు కావాలని ఈ నెల 12న జరిగిన విచారణ సందర్భంగా ఎఎస్ఐ కోరింది. అందుకు న్యాయస్థానం అంగీకరించింది. సర్వే నివేదికను అందజేసేందుకు న్యాయస్థానం ఇప్పటి వరకూ ఏఎస్ఐకి ఎనిమిది సార్లు గడువు పొడిగించింది.

లక్నోలో ఘోరం

- ఆపరేషన్ థియేటర్‌లో అగ్నికీలలు
- చిన్నారిసహా ఇద్దరు మృతి

లక్నో : ప్రభుత్వాసుపత్రి ఆపరేషన్ థియేటర్‌లో మంటలు చెలరేగడంతో చికిత్స పొందుతున్న ఓ చిన్నారి, మరో మహిళ ప్రాణాలు కోల్పోయిన ఘటన ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో చోటుచేసుకుంది. ఓ మహిళ సర్జరీ నిమిత్తం పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్‌లో చేరింది. మరో చిన్నారి గుండె సర్జరీ నిమిత్తం అదే ఆస్పత్రిలో చేరింది. ఆ ఇద్దరు ఆపరేషన్ థియేటర్‌లో ఉండగా మంటలు చెలరేగడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుల కుటుంబ సభ్యులు వాపోయారు. ఆస్పత్రి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్‌కు ఇడి తాజా సమన్లు

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం మరోసారి సమన్లు జారీ చేసింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఈ నెల 21న విచారణకు రావాలని తాజా సమన్లలో కోరింది. ఈ ఏడాది నవంబర్ 2న కేజ్రీవాల్‌కు ఇడి మొదటిసారి సమన్లు జారీ చేయగా, ఆయన విచారణకు హాజరు కాలేదు. సమన్లు అస్పష్టంగా ఉన్నాయని, రాజకీయ ప్రేరణతోనూ, చట్ట వ్యతిరేకంగానూ ఉన్నాయని కేజ్రీవాల్ ఆరోపించారు. పది రోజుల ధ్యాన కోర్సు కోసం గుర్తు తెలియని ప్రదేశానికి ఈ నెల 19న ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బయలుదేరి వెళతారని అధికారులు శనివారమే ప్రకటించారు.

కరాచీ ఆస్పత్రిలో దావూద్ ఇబ్రహీం?

ఇస్లామాబాద్: అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని సమాచారం. పాకిస్థాన్‌లోని కరాచీ ఆసుపత్రిలో చేరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దావూద్ ఇబ్రహీంపై విషప్రయోగం జరిగిందని సోషల్ మీడియాలో అనేక కథనాలు ఇప్పటికే వెలువడ్డాయి. ఈ నివేదికల నిజానిజాలపై ఎటువంటి నిర్ధారణ లేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. దావూద్ ఇబ్రహీం రెండు రోజుల క్రితం ఆసుపత్రి పాలయ్యాడు. ఆసుపత్రిలో పటిష్ట భద్రత నడుమ చికిత్స చేయించుకుంటున్నాడు. దావూద్ చికిత్స కొనసాగుతున్న ఫ్లోర్‌లో ఆయన ఒక్కర్నే ఉంచినట్లు సమాచారం. ఆసుపత్రి వైద్యులు, దావూద్ సన్నిహిత కుటుంబ సభ్యులకు మాత్రమే ఆ ఫ్లోర్‌లోకి ప్రవేశం ఉందని తెలుస్తోంది. దావూద్ ఆసుపత్రిలో చేరడంపై అతని బంధువులు అలీషా పార్కర్, సాజిద్ వాగ్లే నుండి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు ముంబై పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఆయన రెండో పెళ్లి చేసుకున్న తర్వాత కరాచీలో ఉంటున్నాడని దావూద్ ఇబ్రహీం సోదరి హసీనా పార్కర్ కుమారుడు జనవరిలో నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ (ఎన్ఐఎ)కి తెలిపిన విషయం తెలిసిందే. కరాచీ ఎయిర్‌పోర్టును దావూద్ ఇబ్రహీమ్ అనుయాయులే నియంత్రిస్తున్నారని ఎన్ఐఎ ఛార్జిషీట్‌లో పేర్కొన్న విషయం కూడా తెలిసిందే. మరోవైపు దావూద్ ఇబ్రహీంకు దగ్గరి బంధువు అయిన క్రికెటర్ జావేద్ మియందాద్‌ను, అతడి కుటుంబాన్ని హౌజ్ అరెస్ట్‌లో పెట్టింది అక్కడి ప్రభుత్వం. జావేద్ మియందాద్, అతడి కుటుంబం బహిరంగంగా ఉండడం అంత శ్రేయస్కరం కాదని, మియందాద్ రక్షణ కోసమే అతడిని హౌజ్ అరెస్ట్‌లో పెట్టినట్టు పాక్ మీడియా వర్గాలు వెల్లడించాయి.

ఎన్‌డిఎ పై ఐక్య పోరాటం

- ప్రతిపక్ష పార్టీలు కలిసే ఉంటాయి : లాలూ
- నేడు ఢిల్లీలో 'ఇండియా' వేదిక నాలుగో సమావేశం
- హాజరుకానున్న లాలూ, నితీశ్

పాట్నా: ఢిల్లీలో ప్రతిపక్ష వేదిక 'ఇండియా' నాలుగో సమావేశం నేడు జరగనున్నది. ఈ సమావేశానికి ముందు అందరి దృష్టి బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌పై ఉన్నది. ఈ ఇద్దరూ ఈ సమావేశానికి హాజరవుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని ఎదుర్కోవటానికి సీట్ల సర్దుబాట్లు, అజెండాను ఖరారు చేయటంలో వీరు నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నారు.

ఈ సమావేశంలో పాల్గొనటానికి వెళ్లే ముందు లాలూ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ వేదిక ఐక్యత, మోడీ సర్కారుపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి ఉంటాయనీ, సమిష్టిగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌తో కలిసి ఢిల్లీకి బయలుదేరే ముందు లాలూ ప్రసాద్ యాదవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాల కూటమి ఏకమై ఈసారి ప్రధాని మోడీని గద్దె దించేందుకు పోరాడుతుందని చెప్పారు. ప్రతిపక్ష వేదికని ప్రస్తుత రూపంలో పటిష్టం చేయటంలో ముఖ్య పాత్ర పోషించిన ముఖ్యనేతలలో ఒకరిగా లాలూ ఉన్నారు.

బీహార్ సీఎం, జెడియు చీఫ్‌గా ఉన్న నితీశ్ కుమార్ కూడా 'ఇండియా' వేదిక సమావేశానికి హాజరుకానున్నారు. లాలూ, నితీశ్ ఇద్దరు బిజెపి హిందూత్వ అస్త్రాన్ని (కమండల్) ఎదుర్కోవటానికి 'మండల్' అనే కులగణన అంశాన్ని వాడాలని చూస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు తెలిపారు. బీహార్‌లోని మహాఘట్‌బంధన్ ప్రభుత్వం కుల సర్వే నివేదికను విడుదల చేయటం, రిజర్వేషన్‌లను పెంచడం వంటి రెండు డిమాండ్‌లను నెరవేర్చిందని వారు చెప్పారు. లాలూ, నితీశ్‌లు ఇద్దరు 'ఇండియా' వేదికలో ప్రధాన మిత్రపక్షమైన కాంగ్రెస్‌ను జాతీయ స్థాయిలో ప్రధాన వాగ్దానంగా ఉపయోగించుకునేలా ఒప్పించగలిగితే ఇది గేమ్ ఛేంజర్ కావచ్చని వారు విశ్లేషిస్తున్నారు. దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే గట్టిగా వాదన వినిపిస్తున్నారు.

బిజెపిని ఎదుర్కోవటానికి ఐక్య ప్రతిపక్షం (ఇండియా) తప్పనిసరని నితీష్ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ కలిసికట్టుగా పోరాడాలని కోరుకుంటున్నానని చెప్పారు. కూటమిలో తనకు ఎలాంటి పదవీ అక్కర్లేదని ఆయన ఇప్పటికే అనేక సార్లు స్పష్టం చేశారు.

తమిళనాడులో భారీ వర్షాలు

- వరదలతో అతలాకుతలం
- పలు ప్రాంతాలు జలమయం
- విరిగిన కొండచరియలు
- 4 జిల్లాల్లో స్కూళ్లు, కాలేజీలు బంద్
- రాబోయే ఏడు రోజులూ భారీ వర్షాలు : ఐఎండి

తిరునెల్వేలిలో నీట మునిగిన వీధులు

చెన్నై : తమిళనాడును భారీ వర్షాలు ముంచెస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వరదలు అనేక ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్నాయి. పలు చోట్ల కొండచరియాలు విరిగిపడ్డాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తిరునెల్వేలి, తూత్తుకుడి, కన్యాకుమారి, తెన్‌కాశి అనే నాలుగు జిల్లాల్లోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులకు సెలవు ప్రకటించింది. సోమవారం ఉదయం కూడా తమిళనాడులోని దక్షిణ ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రాబోయే ఏడు రోజుల పాటు రాష్ట్రానికి 'భారీ వర్షాల హెచ్చరిక'ను జారీ చేసింది.

తూత్తుకుడి జిల్లాలోని తిరుచెందూర్, సత్తంకుళం స్టేషన్లలో గత 24 గంటల్లో 606 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, తిరునెల్వేలిలోని పాలయంకోట్టై స్టేషన్‌లో 260 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం 10 గంటల వరకు మధురై, విరుదునగర్, తేని జిల్లాల్లోని కొన్ని చోట్ల ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. తూత్తుకుడి, దిండిగల్, కోయంబత్తూర్, తిరుప్పూర్ జిల్లాల్లోని పలు ప్రదేశాలపై వాతావరణ సంస్థ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

కోవిల్‌పట్టి ప్రాంతంలోని 40 సరస్సులు నిండు కుండలా ఉన్నాయి. కోవిల్‌పట్టి పంచాయతీలోని 40 చెరువులు నిండాయి. రెండు సరస్సులు దెబ్బతిన్నాయి. మేము ఇతర సరస్సులను కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తూత్తుకుడి జిల్లా జిల్లా అభివృద్ధి అధికారి రాజేష్ తెలిపారు. తిరునెల్వేలి జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా కుర్తాళం, మణిముత్తారు జలపాతాలు పొంగిపొర్లుతున్నాయి. నీలగిరి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఊటీలో కొండచరియలు విరిగిపడిన సంఘటనలు నమోదయ్యాయి. తూత్తుకుడిలో పలుచోట్ల వరదలు పొంగిపొర్లుతున్నాయి.

దీంతో ఇక్కడ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. "ముందుజాగ్రత్త చర్యగా, కన్యాకుమారి, తిరునల్వేలి, టుటికోరిన్, తెన్కాసి జిల్లాల్లో 250 రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు (ఎస్డీఆర్ఎఫ్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాన్ని (ఎన్డీఆర్ఎఫ్) మోహరించాం. రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌కు చెందిన మరికొంత మంది సభ్యులు నేడు తెన్‌కాసి జిల్లాకు రానున్నారు. నేను కూడా వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తాను" అని తమిళనాడు రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ మంత్రి కెకెఎస్ఎస్ఆర్ రామచంద్రన్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాకు (మంత్రి, ఐఎఎస్ అధికారులు) అక్కడికక్కడే ఉండి ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారని ఆయన చెప్పారు. తిరునల్వేలిలో 19, కన్యాకుమారిలో 4, తూత్తుకుడిలో 2, తెన్కాసి జిల్లాలో ఒక శిబిరంతో సహా వర్షాల వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకోవడానికి వివిధ జిల్లాల్లో సహాయ శిబిరాలను ఏర్పాటు చేశారు.

'మాకు ఛాన్సలర్ కావాలి, సావర్కర్ కాదు'

- క్యాంపస్‌లలో నిరసనల హోరు

గవర్నర్ తీరును నిరసిస్తూ విద్యార్థులు ఏర్పాటు చేసిన బ్యానర్లు

తిరువనంతపురం : కేరళ, కొచ్చిన్ యూనివర్సిటీ సెనేట్లలో సంఘ్‌పరివార్‌కు చెందిన సభ్యులను నామినేట్ చేస్తూ ఛాన్సలర్ హోదాను దుర్వినియోగపరుస్తున్న గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ చర్యలను నిరసిస్తూ విద్యార్థులు ఎక్కడికక్కడ ఆందోళనకు దిగుతున్నారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలోను సోమవారం నిరసనలు హోరెత్తాయి. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు కాలేజీలు, యూనివర్సిటీల్లో గవర్నర్ దిష్టిబొమ్మలను తగులబెట్టారు. 'సంఘీ ఛాన్సలర్ గోబ్యాక్', 'విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్లు కావాలి "సార్వర్కరేయులు కాదు", "మిస్టర్ ఛాన్సలర్ దిస్ ఈజ్ కేరళ" అంటూ వారు బిగ్గరగా నినదించారు. "మాకు ఛాన్సలర్ కావాలి, సావర్కర్ కాదు" అని రాసి ఉన్న బ్యానర్‌తో ఎర్నాకుళం మహారాజా కళాశాలలో విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. వ్యంగ్య చిత్రాలు గీసి గోడలపై అతికించారు. మలయాళం, హిందీ, అరబిక్ , ఆంగ్ల భాషల్లో నినాదాలు రాశారు. సాయంత్రం కళాశాల ఎదుట బ్యానర్లు, చిత్రపటాలతో తరలివచ్చి నిరసనకు సంఘీభావం తెలిపారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువతీ యువకులు రాజ్‌భవన్ వరకు ప్రదర్శన నిర్వహించి ఛాన్సలర్‌కు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. 'సంఘీచాన్సలర్ గోబ్యాక్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో పలువురు గవర్నరు చర్యను నిరసించారు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలోనూ నిరసనలు జరిగాయి.

భారత్‌లో ఇజ్రాయిల్ రాయబారిగా రూవెన్ అజార్

జెరూలేసం : భారత్‌లో ఇజ్రాయిల్ నూతన రాయబారిగా రూవెన్ అజార్‌ను నియమించారు. శ్రీలంక, భూటాన్‌లకు కూడా రూవెన్ అజార్ ప్రవాస రాయబారిగా వ్యవహరిస్తారని ఇజ్రాయిల్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. అజార్ ప్రస్తుతం రొమేనియాలో ఇజ్రాయిల్ రాయబారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. న్యూఢిల్లీలో ఆయన ఎప్పుడు బాధ్యతలు స్వీకరిస్తారో ఇంకా వెల్లడికాలేదు. అజార్ 2014 నుంచి 2018 వరకూ అమెరికాలోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయంలో ఉప రాయబారిగా పనిచేశారు. అర్జెంటీనాలో జన్మించిన అజార్ 13 ఏళ్ల వయసులో కుటుంబంతో కలిసి ఇజ్రాయిల్‌కు వలస వచ్చారు. హిబ్రూ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సంబంధాల అంశంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు.

కువైట్ అమీర్ అంత్యక్రియలు పూర్తి

కువైట్ సిటీ : కువైట్ అమీర్ షేక్ నవాఫ్ అల్-అహ్మద్ అల్-సబా అంత్యక్రియలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమీర్ హోదాలో దాదాపు మూడేళ్లు కువైట్‌ను పరిపాలించారు. 86 ఏళ్ల షేక్ నవాఫ్ అనారోగ్య కారణాలతో ఈ నెల 16న మరణించారు. బిలాల్ బిన్ రబాహ్ మసీదులో ప్రార్థనల తర్వాత సులైబిఖాత్ శ్మశానవాటికలో ఖననం చేశారు. ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు, ప్రముఖులు షేక్ నవాఫ్‌కు నివాళులర్పించారు. 'కువైట్ రాజ కుటుంబానికి, నాయకత్వానికి, కువైట్ ప్రజలకు మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము' అని ప్రధాని నరేంద్ర మోడీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక ప్రతినిధిగా ఈ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు.

కువైట్ మిషన్‌ను సందర్శించిన జైశంకర్

ఢిల్లీలో ఉన్న కువైట్ రాయబార కార్యాలయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సోమవారం సందర్శించారు. అమీర్ షేక్ నవాఫ్ మృతికి సంతాపం తెలిపారు. భారత్-కువైట్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో షేక్ నవాఫ్ చేసిన కృషిని భారత్ ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని జైశంకర్ తెలిపారు.

మెక్సికోలో క్రిస్మస్ వేడుకల్లో కాల్పులు

- 16 మంది మృతి

మెక్సికో : మెక్సికోలో నిర్వహించిన క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో 16 మంది మరణించగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాల్పులు జరిపిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. గ్వానాజువాటో రాష్ట్రంలోని సల్వటియేర్రా పట్టణంలో ఆదివారం రాత్రి క్రిస్మస్ ముందస్తు వేడుకలు నిర్వహించారు. టియేర్రా నెగ్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భద్రతా కారణాల దృష్ట్యా ఆరుగురిని నిర్వాహకులు అనుమతించలేదు. క్రిస్మస్ వేడుకలు ముగిసిన అనంతరం అందరూ బయటకు వచ్చి తమ నివాసాలకు వెళ్తుండగా, ఆ ఆరుగురు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 16 మంది మరణించగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ వేడుకకు సుమారు వంద మంది హాజరై ఉంటారని, అందులో యువతీయువకులే అధికంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆరుగురి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సంప్రదాయవాద రాజ్యాంగానికి తిరస్కరణ

- రిఫరెండంలో వ్యతిరేకించిన 55.8 శాతం మంది చిలీ ఓటర్లు

శాంటియాగో : సంప్రదాయవాదంతో రచించిన రాజ్యాంగాన్ని చిలీ ఓటర్లు తిరస్కరించారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన రిఫరెండంలో ప్రతిపాదిత సంప్రదాయవాద రాజ్యాంగానికి వ్యతిరేకంగా సుమారు 55.8 శాతం మంది ఓటు వేశారు. అనుకూలంగా 44.2 శాతం మంది మాత్రమే ఓటు వేశారు. లెఫ్ట్ లైనింగ్ కన్వెన్షన్ రచించిన కొత్త రాజ్యాంగాన్ని ఏడాది క్రితం తిరస్కరించిన ఓటర్లు తాజాగా సంప్రదాయవాద రాజ్యాంగాన్ని తిరస్కరించారు. లెఫ్ట్ లైనింగ్ కన్వెన్షన్ రచించిన కొత్త రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత ప్రగతిశీల చార్టర్‌లలో ఒకటిగా పేర్కొనబడింది. మరోవైపు ఈ ప్రతిపాదిత సంప్రదాయ రాజ్యాంగంపై తొలి నుంచి అనేక అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ రాజ్యాంగం స్వేచ్ఛా మార్కెట్‌కు అనుకూలంగా ఉందని, ప్రజా సంక్షేమ కార్యక్రమంలో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గిస్తుందని, మహిళా హక్కులను పరిమితం చేసేవిధంగా ఉందని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా గర్భస్రావం పూర్తిగా చట్టవిరుద్ధం అవుతుందని కొంతమంది హెచ్చరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న, సమాజానికి పెద్ద ప్రమాదంగా భావించని ఖైదీలను గృహ నిర్బంధానికి పరిమితం చేయడానికి ఈ రాజ్యాంగం అవకాశం కల్పిస్తుంది. ప్రతిపాదిత రాజ్యాంగాన్ని ప్రజలు తిరస్కరించిన నేపథ్యంలో ఈ అంశాన్ని మళ్లీ లేవనెత్తవద్దని ప్రభుత్వానికి కన్జర్వేటివ్ ఇండిపెండెంట్ డెమొక్రటిక్ యూనియన్ పార్టీ నాయకులు జేవియర్ మకాయా విజ్ఞప్తి చేశారు. చిలీలో 2019 నుంచి కొత్త రాజ్యాంగాన్ని రచించే ప్రక్రియ ప్రారంభమైంది. 2022లో జరిగిన ఓటింగ్‌లో లెఫ్ట్ లైనింగ్ కన్వెన్షన్ రచించిన కొత్త రాజ్యాంగానికి వ్యతిరేకంగా 62 శాతం మంది ఓటు వేశారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజీనామా

- 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో పోలీసుల తరఫున వాదనలు

న్యూఢిల్లీ : ఈశాన్య ఢిల్లీలో 2020 ఫిబ్రవరిలో జరిగిన మత ఘర్షణలకు సంబంధించిన కేసుల్లో ఢిల్లీ పోలీసుల తరఫున వాదించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ ప్రసాద్ రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాకు సమర్పించారు. 'ఢిల్లీ అల్లర్ల కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నన్ను నియమించారు. గత మూడు సంవత్సరాలుగా నేను ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఈ కాలంలో నా సామర్థ్యానికి తగినట్లు ప్రాసిక్యూషన్ కేసులు వాదించాను. అయితే ఇప్పుడు నేను ఈ పదవిలో కొనసాగలేను. అందుకే రాజీనామా చేస్తున్నాను. దీనిని ఆమోదించాల్సిందిగా కోరుతున్నాను. నాకు ఇచ్చిన ఈ అవకాశానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను' అని సక్సేనాకు పంపిన లేఖలో అమిత్ ప్రసాద్ తెలియజేశారు.

శ్రద్ధా వాకర్ హత్య కేసులో అమిత్ ప్రసాద్ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొనసాగుతారని న్యాయ వర్గాలు తెలిపాయి. కాగా తన ప్రైవేటు ప్రాక్టీసుకు, ఢిల్లీ అల్లర్ల కేసులకు మధ్య చాలా ఘర్షణ జరుగుతోందని, శ్రద్ధా వాకర్ హత్య కేసుకు తన శక్తిని, సమయాన్ని ఎక్కువగా వెచ్చించాల్సి వస్తోందని ప్రసాద్ తెలిపారు. ఢిల్లీ అల్లర్ల కేసుల దర్యాప్తులో పోలీసుల తీరును పలువురు న్యాయమూర్తులు తీవ్రంగా తప్పుపట్టారు. పోలీసుల దర్యాప్తు పక్షపాతపూరితంగా ఉన్నదని, సరిగా లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఢిల్లీ అల్లర్లకు సంబంధించి ఐపీసీ కింద 758 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ హింసాకాండలో 53 మంది చనిపోగా 700 మందికి పైగా గాయపడ్డారు. ఈశాన్య ఢిల్లీలో నాలుగు రోజుల పాటు హింస చెలరేగింది. అనేక కేసులలో న్యాయస్థానాలు నిందితులను నిర్దోషులుగా విడిచిపెట్టాయి. పోలీసులు తప్పుడు సాక్ష్యాలు సృష్టించారని, విచారణ నాసిరకంగా ఉన్నదని, తర్కం లేదని న్యాయస్థానాలు తూర్పార పట్టాయి. పోలీసుల దర్యాప్తు తీరు విచిత్రంగా ఉన్నదని, నిర్దోషులుగా విడుదలైన వారిని పోలీసులు అనేక నెలల పాటు కటకటాల వెనక పెట్టారని వ్యాఖ్యానించాయి.

లోక్‌సభకు తెలంగాణ నుంచి సోనియా పోటీ

- టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి సోనియాగాంధీ పోటీ చేయాలని పిఎసి సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు హైదరాబాద్ గాంధీభవన్‌లో ఎఐసిసి ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావ్‌ఠాక్రే అధ్యక్షతన సోమవారం జరిగిన టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కమిటీ కన్వీనర్ షబ్బీర్ అలీ, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు సంపూర్ణ మద్దతు పలికిన ప్రజలకు, కష్టి చేసిన కార్యకర్తలు, నాయకులకు, ప్రచారంలో పాల్గొన్న ఎఐసిసి అగ్రనాయకులకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలనీ, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని మానిక్‌రావు ఠాక్రే సూచించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో షబ్బీర్ అలీ వివరాలు వెల్లడించారు. తెలంగాణ ఇచ్చిన తల్లిగా సోనియాకు రుణపడి ఉంటామన్నారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగపూర్‌లో ఈ నెల 28న జరిగే వేడుకకు రాష్ట్రం నుంచి 50 వేల మంది తరలి వెళతారని తెలిపారు. రాష్ట్రంలో 28 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నామని, రేషన్ కార్డులు, పెన్షన్లు, హౌసింగ్ కోసం లబ్దిదారులను గ్రామసభల ద్వారానే ఎంపిక చేయనున్నామని తెలిపారు. నామినేటెడ్ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని సిఎం చెప్పారన్నారు. రెండు గ్యారంటీలు అమలు చేస్తున్నామనీ, మిగితా నాలుగు గ్యారంటీలు త్వరలోనే అమలు చేయనున్నట్టు తెలిపారు.

శారీరకంగా వేధించాడు

- కారుతో తీవ్రంగా గాయపర్చాడు
- మహారాష్ట్ర బిజెపి యువ నాయకుడిపై బాధితురాలి ఆరోపణలు

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో బీజేపీ యువజన విభాగం బీజేవైఎంతో సంబంధ ఉన్న వ్యక్తి తనను శారీరకంగా వేధించాడని ఆయన స్నేహితురాలు ఆరోపించింది. అలాగే, తనను తీవ్రంగా గాయపరిచాడని చెప్పింది. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ప్రకారం.. ఈనెల 11న తెల్లవారుజామున థానేలోని ఓ హోటల్‌లో ఈ ఘటన జరిగింది. అశ్వజిత్ గైక్వాడ్ అనే యువకుడు కుటుంబ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆహ్వానించాడు. దీంతో ఆమె హోటల్‌కు చేరుకున్నది. అక్కడ వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం అశ్వజిత్ గైక్వాడ్ బాధితురాలిపై శారీరక వేధింపులకు దిగాడు. ఆ తర్వాత గైక్వాడ్ తన డ్రైవర్‌ను ఆమెపైకి కారు నడపాలని ఆదేశించాడు. దీంతో ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ అతనిపై హత్యాయత్నానికి, శారీరక వేధింపులకు పాల్పడినట్టు కానీ పోలీసులు అందులో పేర్కొనకపోవటం గమనార్హం. నిందితుడిని కానీ, ఆయనకు సహకరించిన వారిని కూడా పోలీసులు అరెస్టు చేయలేదు. ఈ అంశంపై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు స్పందించింది. హాస్పిటల్ బెడ్‌పై నుంచి తన గాయాలను చూపిస్తూ, పోలీసులు ఒత్తిడిలో పనిచేశారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో వీడియో క్లిప్‌ను అప్‌లోడ్ చేసింది. గైక్వాడ్ బీజేపీ కార్యకర్తే కాకుండా రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో సీనియర్ బ్యూరోక్రాట్ కుమారుడు కూడా. వీడియో క్లిప్ వైరల్ కావటంతో స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. థానే పోలీస్ కమీషనర్ జై జీత్ సింగ్ మాట్లాడుతూ.. ఈ సంఘటనపై సిట్ సమగ్ర విచారణ చేపడుతుందనీ, దీనికి పోలీసు ర్యాంక్ డిప్యూటీ కమిషనర్ నాయకత్వం వహిస్తారని చెప్పారు.

మెయితీ లీపున్ నాయకుడిపై కేసు

ఇంఫాల్ : కొంత మంది వ్యక్తులపై విచక్షణారాహిత్యంగా కాల్పులు జరిపినందుకు మెయితీ లీపున్ చీఫ్ ప్రమోత్ సింగ్‌పై మణిపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక భూ వివాదంలో ప్రమోత్ ఈ కాల్పులకు తెగబడ్డాడు. ఈ నెల 12న ఈ ఘటన జరగగా, సిసిటివి పుటేజ్ ఆధారంగా కేసు నమోదయింది. ఈ కాల్పుల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటి వరకూ ఎవ్వరినీ అరెస్టు చేయలేదు. కాగా, ప్రమోత్ సింగ్‌పై ఇది రెండో కేసు. రెండు సామాజిక తరగతుల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం, నేరపూరిత కుట్ర వంటి ఆరోపణలతో జులై 8న సింగ్‌పై కేసు నమోదయింది. ఈ కేసులో జనవరి 15 వరకూ అరెస్టు చేయకుండా సింగ్‌కు మణిపూర్ హైకోర్టు రక్షణ కల్పించింది.

మరో 78 మంది ఎంపీలపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

45 మంది ఎంపిలలో కాంగ్రెస్‌కు చెందిన 18 మంది, టిఎంసికి చెందిన ఏడుగురు, డిఎంకెకు చెందిన ఐదుగురు, సిపిఎంకు చెందిన ముగ్గురు, సిపిఐ, ఆర్‌జెడి, జెడియు, ఎస్‌పిలకు చెందిన ఇద్దరేసి, ఎన్‌సిపి, జెఎంఎం, కేరళ కాంగ్రెస్ ఎం, ఎంజిఎంకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. సిపిఎం నుంచి సస్పెన్షన్‌కు గురైన ముగ్గురిలో వి.శివదాసన్, జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీమ్ ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి మంచి సంకేతం కాదు : హర్ సిమ్రత్ కౌర్ బాదల్

ఎంపిల సస్పెన్షన్ ప్రజాస్వామ్యానికి మంచి సంకేతం కాదని ఎస్ఎడి ఎంపి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ అన్నారు. 'ఇది పెద్ద భద్రతా లోపం, ఇంటెలిజెన్స్ వైఫల్యం.. ఇది ఎలా జరిగిందో ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు. దేశ ప్రజలు చూస్తున్నారు. ప్రశ్నలు అడిగిన వారిని సస్పెండ్ చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచి సంకేతం కాదు' అని ఆమె అన్నారు.

ప్రతిపక్షం లేని సభ : ఖర్గే

రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. 'మొదట, చొరబాటుదారులు పార్లమెంటుపై దాడి చేశారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం పార్లమెంట్, ప్రజాస్వామ్యంపై దాడి చేసింది. 47 మంది ఎంపిలను సస్పెండ్ చేయడంతో నిరంకుశ మోడీ ప్రభుత్వం అన్ని ప్రజాస్వామ్య నిబంధనలను చెత్తబుట్టలో పడవేస్తోంది' అని విమర్శించారు. పార్లమెంట్ భద్రతలో క్షమించరాని ఉల్లంఘనపై కేంద్ర హోంమంత్రి పార్లమెంటు ఉభయ సభల్లో ప్రకటన చేయాలి. దీనిపై సవివరమైన చర్చ జరగాలి. ప్రధాని మోడీ వార్తాపత్రికకు ఇంటర్వ్యూ ఇవ్వవచ్చు. హోంమంత్రి టివి ఛానెళ్లకు ఇంటర్వ్యూలు ఇవ్వొచ్చు. కానీ, భారత ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటుకు వారి జవాబుదారీతనం సున్నా. 'ప్రతిపక్షాలు లేని పార్లమెంటుతో, మోడీ ప్రభుత్వం ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన చట్టాలను బుల్డోజ్ చేయగలదు. ఎలాంటి అసమ్మతిని ఎలాంటి చర్చ లేకుండానే అణచివేయగలదు' అని విమర్శించారు.

చిన్నారి

ఫైన్ ఆర్ట్స్ స్టూడెంట్స్ కమ్యూనిటీ సభ్యులు

JEEVANA జీవన the family

సీతాఫలం

సీతాఫలం సీతాఫలం
శీతాకాలపు మధుర ఫలం
తియ్యని రుచుల తేనె ఫలం
కనువిందైన కమ్మని ఫలం

సీతాఫలం సీతాఫలం
చలికాలం సుందర ఫలం
నోరూరించే సుమధుర ఫలం
నవనవలాడే నవ్య ఫలం

సీతాఫలం సీతాఫలం
చూడచక్కని తీపి ఫలం
మధువొలికించు రమ్య ఫలం
తెల్లని తీయని గుజ్జుఫలం

సీతాఫలం సీతాఫలం
చిరునవ్వుల దివ్య ఫలం
పోషక విలువల భవ్య ఫలం
ఔషధ గుణాల ఆరోగ్య ఫలం

– గుండాల నరేంద్ర బాబు,
తెలుగు భాషా పరిశోధకులు,
94932 35992.

జవాబు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను కలిపి, పక్కనే ఉన్న బాక్సులో జవాబు రాయండి.

నేను గీసిన బొమ్మ

ప్రవీణ్,
9వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్ హవేళి ఘణపూర్,
మెదక్‌జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కాన్వాస్‌పై పాలస్తీనా గాయం

పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరిపిన అత్యంత అనాగరికమైన యుద్ధచర్యను ఆ విద్యార్థుల కుంచె ప్రశ్నించింది. ముక్కుపచ్చలారని పసివారిని సైతం పాలస్తీనా గడ్డపై బలి తీసుకున్న రక్తపిశాచి నెతన్యాహు దుర్మార్గ వైఖరిని కళ్ల ముందుంచింది. జాతి నిర్మూలనే లక్ష్యంగా పాలస్తీనాపై జరుగుతున్న అమానవీయ యుద్ధకాండను నిరసించింది. శాంతి ప్రాముఖ్యతను వివరించింది. నవయువ చిత్రకారులు సృజియించిన ఈ రంగుల స్వరాలకు విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికైంది.

పాలస్తీనాకు సంఘీభావంగా ఆంధ్ర యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ స్టూడెంట్స్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. 'జాతి వివక్షతకు వ్యతిరేకంగా' చేపట్టిన ఈ ప్రదర్శన ఈ నెల 11, 12 తేదీల్లో సాగింది. నగర వాసులు, యువతీ యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ ప్రదర్శనను సందర్శించారు.

విభిన్న చిత్రాలు.. ఒక్కటే సందేశం

ఈ చిత్రకళా ప్రదర్శనలో పాలస్తీనాలోని తాజా పరిస్థితులను తెలియజేస్తూ 50 చిత్రాలు కొలువుదీరాయి. వాటర్ కలర్ పెయింటింగ్, ఆయిల్ పెయింటింగ్, ఆక్రిలిక్ పెయింటింగ్, గ్రాఫైట్ పెయింటింగ్, డిజిటల్ ఆర్ట్, ప్రింట్ మేకింగ్, లినోకట్ ఎట్చింగ్, జింక్ ప్లేట్ ఎట్చింగ్.. ఇలా పలు చిత్రకళా విభాగాల్లో ఎయు ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. వేస్ట్ మెటీరియల్ ఉపయోగించి తయారు చేసిన బొమ్మలు ఆలోచింపజేశాయి. 'ఇజ్రాయిల్ బాంబుల దాడికి పాలస్తీనాలో కూలిన గోడ కింద నలిగిన చిన్నారి పాదం' బొమ్మను అచ్చుగుద్దినట్టు ఫైన్ ఆర్ట్ నాలుగో సంవత్సరం విద్యార్థి గౌతమ్ తయారు చేశాడు. భవన శిథిలాల్లో చిక్కుకున్న వందల మంది చిన్నారుల మృతదేహాలు, అక్కడి రక్తపాతం కళ్లకు కడుతూ తిరుపతి, ఖాన్ తయారు చేసిన బొమ్మ కూడా పలువురిని కదిలించింది. 'ఇప్పుడు మేము మా ఇళ్లను ఇక్కడ వదిలేసి వెళ్తున్నాం. మళ్లీ ఇక్కడకు వస్తాం' అన్న అర్థం ధ్వనించేలా 'పాలస్తీనా కీ' బొమ్మను, చిత్రాలను అశోక్, ఇంకొంత మంది విద్యార్థులు రూపొందించారు.

కాన్వాస్‌పై.. గాయాల గాజా

గాజా మొత్తం శవాలగుట్టగా మారిందన్న అర్థం వచ్చేలా ఎక్కువ మంది చిత్రాలు వేశారు. యుద్ధం జరగక ముందు – జరుగుతున్నప్పుడు – ఆగిన తర్వాత పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలియజేస్తూ.. భిన్న పరిస్థితులను ఒకే చిత్రంలో ఇమిడ్చింది విద్యార్థి శరణ్య. తల్లి కొడుకును కాపాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని తెలియజెప్పాడు ఖాన్. ఐక్యరాజ్య సమితి చూస్తుండగానే గాజాపై బుల్లెట్ ఎలా దిగిందో చెప్పాడు చంటి. చదువుకు దూరమవుతున్న విద్యార్థులు, వారి హాహాకారాలను తెలియజెప్పాడు లోకేష్. కుమారుని మృతదేహాన్ని తన ఒడిలో పెట్టుకుని రోధిస్తున్న ఓ తండ్రి బాధను, ఫుట్‌బాల్ నెట్ ఎదుట గాయంతో రోధిస్తూ కూలబడ్డ విద్యార్థి ఆక్రందనను తన చిత్రాల్లో తెలియజెప్పాడు ఎన్.అజయ్. 'యుద్ధం వద్దు.. బాలల బతుకులు ముఖ్యం' అంటూ ఓ చిత్రాన్ని వేశాడు లెనిన్.



పేపర్ పేస్ట్‌తో, గ్రాఫైట్ పౌడర్‌తో ...

ఈ ప్రదర్శనలో ఎస్.శ్రీదేవి పేపర్ పేస్ట్‌తో పాలస్తీనా మహిళ బొమ్మను వేసింది. తొలుత ఆమె పేపర్‌ను ముద్దగా చేసింది. స్కార్ఫ్ ధరించిన మహిళ రూపం వచ్చేలా ఆ ముద్దను కాన్వాస్‌పై అతికించింది. డ్రై అయ్యాక కలర్స్ వేసింది. పెన్సిల్‌తో ఆ కాన్వాస్‌పైనే గాజా మ్యాప్, ముళ్ల కంచెలను ఆవిష్కరించింది. శాంతికి ప్రతిబింబంగా పావురాన్ని బ్యాగ్రౌండ్‌లో వేసింది. పాలస్తీనా మహిళలు సంప్రదాయబద్ధంగా ధరించే స్కార్ఫ్‌లో యూనిటీని పొందుపరుస్తూ పి.వేలాంగిణి అద్భుతమైన బొమ్మ వేసింది. గ్రాఫైట్ పౌడర్ ఉపయోగించి కావ్య పలు చిత్రాలను తీర్చిదిద్దింది. తమపై బాంబుల వర్షం కురుస్తుంటే పౌరులు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్న భావం వచ్చేలా కావ్యశ్రీ; పాలస్తీనాలో దయనీయ పరిస్థితులను సోషల్ మీడియాలో చూసి మరీ ఏం చేయలేకపోతున్నామే అని మథనపడుతున్న వారి బాధను తెలుపుతూ కావ్య కళాచిత్రాలను రూపొందించారు.

ఖర్చు మొత్తం తామే భరించి ...

ఈ చిత్ర కళా ప్రదర్శనకు అయ్యే ఖర్చంతా ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులే భరించారు. కాన్వాస్, పెయింట్స్, గ్రాఫైట్ పౌడర్, పేస్టులు, ఇతరత్రా సామగ్రిని వారే సమకూర్చుకున్నారు. పాలస్తీనాపై జరుగుతున్న అమానవీయ దాడిని బాహ్య ప్రపంచానికి తెలియజేయాలన్న కాంక్ష ఒక్కటే వారిలో కనిపించింది. ఈ చిత్ర కళా ప్రదర్శనకు ఎన్.అజయ్, ఛరిష్మా, తిరుపతి, ఇంతియాజ్, శ్రీదేవి, కావ్యశ్రీ, సమీరా, కావ్య, జీనత్, వేలాంగిణి తదితరులు నిర్వహించారు. 'పాలస్తీనా కోసం మేము సైతం' అంటూ వారు మరికొన్ని ప్రదర్శనలకు సిద్ధమవుతున్నారు.

– కోడూరు అప్పలనాయుడు,
94915 70765

రంగవల్లి

16 చుక్కలు 6 వరుసలు 6 వచ్చేవరకు



సి.రాజ్యలక్ష్మి,
ఎ.ఎస్.రావ్ నగర్,
7095163101,
హైదరాబాద్.

మా చిరునామా :
మెయిల్ ఐడీ : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

సలార్ రిలీజ్ ట్రైలర్ విడుదల

ప్రభాస్ హీరోగా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా దర్శకుడు ప్రశాంత్‌నీల్ తెరకెక్కించిన చిత్రం సలార్–1. ఈనెల 22న విడుదల కానుంది. తాజాగా సలార్ రిలీజ్ డేట్ ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. బద్ధ శత్రువులుగా మారే ఇద్దరు స్నేహితుల కథాంశంతో సలార్‌ను రెండు భాగాలుగా తీస్తున్న విషయం తెలిసిందే. శ్రుతిహాసన్ హీరోయిన్. బాలీవుడ్ నటుడు దర్శకుడు టీనూ ఆనంద్, జగపతిబాబు, ఈశ్వరీరావు తదితరులు కీలకపాత్రలు పోషించారు.

కోట్లు కొల్లగొట్టేదెవరో..?

- 77భర్తీలకు 333మంది రేసులో..
- నేడు ఐపిఎల్–2024 మినీ వేలం
- మధ్యాహ్నం 1.00గం॥లకు

మల్లిక సాగర్

దుబాయ్: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్–2024) మినీ వేలానికి రంగం సిద్ధమైంది. మినీ వేలం ఈసారి దుబాయ్ వేదికగా మంగళవారం జరగనుంది. ఐపిఎల్–2024 మినీ వేలానికి మొత్తం 1166మంది ఆటగాళ్లు తమ పేర్లను నమోదు చేసుకోగా.. ఐపిఎల్ నిర్వాహకులు 333మంది ప్లేయర్లను షార్ట్ లిస్ట్ చేశారు. ఇందులో 214మంది భారత ప్లేయర్స్ కాగా, 119మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. 10 ఫ్రాంచైజీలు కలిపి మొత్తం గరిష్టంగా 77 మాత్రమే ఖాళీగా ఉండగా.. ఇందులో 30 ఓవర్ సీస్ స్లాట్స్ ఉన్నాయి. వేలంలో ఖర్చు పెట్టడానికి ఫ్రాంఛైజీల వద్ద మొత్తం రూ.262.95 కోట్లు ఉన్నాయి. గుజరాత్ టైటాన్స్ వద్ద అత్యధికంగా రూ.38.15 కోట్లు, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ వద్ద అత్యల్పంగా రూ.13.15 కోట్ల సొమ్ము ఉంది. ఇప్పటికే ఫ్రాంఛైజీలు ఈ వేలానికి సంబంధించిన ప్రణాళి కలను సిద్ధం చేసుకున్నాయి. ఈసారి వేలంలో ఆక్షనీర్‌గా మల్లికా సాగర్ వ్యవహరించ నున్నారు. దీంతో ఐపిఎల్ వేలంలో ఆక్షనీర్‌గా వ్యవహరించ నున్న తొలి మహిళగా ఆమె చరిత్రకెక్క నుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబయి ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంఛైజీలు 11మంది ఆటగాళ్లను విడుదల చేశాయి. గుజరాత్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాను ముంబయి ఇండియన్స్ ఇచ్చి పుచ్చుకొని ధోరణిలో కోల్పోగా.. రోహిత్ శర్మతో ఢిల్లీ ఫ్రాంఛైజీ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

రికార్డుకెక్కనున్న మల్లిక..

48ఏళ్ల మల్లిక సాగర్ ముంబయికి చెందిన ఆర్ట్ కలెక్టర్. ఆమె తొలుత ఉండోల్ ఆర్ట్ గ్యాలరీలో వేలాన్ని నిర్వహించేది. వేలంలో దాదాపు 25 సంవత్సరాల అనుభవం మల్లిక ఉమెన్స్ ప్రిమియర్ లీగ్–2023 వేలంతో పాటు డబ్ల్యూపిఎల్ 2024 వేలానికి కూడా ఆమె ఆక్షనీర్‌గా పనిచేసింది. ప్రొకబడ్డీ లీగ్–2021నుంచి వరుసగా పికెఎల్ వేలాన్ని నిర్వహిస్తోంది. దీంతో ఐపిఎల్ వేలం తొలి ఆక్షనీర్‌గా ఆమె రికార్డులకెక్కనుంది. 16ఏళ్ల ఐపిఎల్ చరిత్రలో వేలాన్ని నిర్వహించనున్న తొలి మహిళ కూడా మల్లికనే. 2008 నుంచి 2018 వరకు రిచర్డ్ మాడ్లీ వేలంపాటదారుగా బాధ్యతలు నిర్వర్తించాడు. దశాబ్ద కాలం పాటు అతడే వరుసగా ఆక్షన్ నిర్వహించాడు. అయితే 2018 నుంచి ఆక్షనీర్ బాధ్యత హ్యు ఎడ్మిడ్స్ అందుకున్నాడు. కానీ 2022 మెగా వేలంలో ఎడ్మిడ్స్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో చారు శర్మ వేలాన్ని కొనసాగించాడు.

ఫ్రాంఛైజీల చూపు రచిన్ రవీంద్రవైపే..

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో రాణించిన న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్రపైనే అన్ని ఫ్రాంఛైజీలు దృష్టి సారించాయి. మినీ వేలంలో అతడు కోట్లు కొల్లగొడతాడని సమాచారం. రచిన్ రవీంద్రతోపాటు వన్డే ప్రపంచకప్ టైటిల్ విజేత ఆస్ట్రేలియా పేసర్లు పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, స్టార్క్‌కు ఈసారి వేలం భారీ ధర పలికవచ్చు.

2024 ఐపిఎల్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి 13 మంది ఆటగాళ్లు బరిలో ఉన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నుంచి 9మంది, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి నలుగురు వేలం రేసులో ఉన్నారు.

ఫ్రాంఛైజీల వద్ద మిగిలి ఉన్న నగదు విలువ

1.	గుజరాత్ టైటాన్స్	: రూ. 38.15 కోట్లు
2.	సన్‌రైజర్స్ హైదరాబాద్	: రూ. 34 కోట్లు
3.	కోల్‌కతా నైట్‌రైడర్స్	: రూ. 32.7 కోట్లు
4.	చెన్నై సూపర్ కింగ్స్	: రూ. 31.4 కోట్లు
5.	పంజాబ్ కింగ్స్	: రూ. 29.1 కోట్లు
6.	ఢిల్లీ క్యాపిటల్స్	: రూ.28.95 కోట్లు
7.	రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు :	రూ.23.25 కోట్లు
8.	ముంబయి ఇండియన్స్	: రూ.17.75 కోట్లు
9.	రాజస్థాన్ రాయల్స్	: రూ. 14.5 కోట్లు
10.	లక్నో సూపర్‌జెయింట్స్	: రూ. 13.5 కోట్లు

బుల్లితెర నటుల సందడి

టీవీ సీరియల్ బ్రహ్మముడి నుంచి కళ్యాణ్, అనామిక కలయికను పురస్కరించుకుని స్టార్ మా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో తమ అభిమానులతో బరాత్ జరుపుకుంది. అందమైన జంట షో నుంచి రాజ్, కావ్య (మానస్, దీపిక) కలిసి కూకట్‌పల్లి ప్రాంతంలోని కొందరు ఇళ్లకు వ్యక్తిగతంలో వెళ్లి తన సోదరుడు పెళ్లి బరాత్‌కు అభిమానులను ఆహ్వానించారు. ఈ వేడుకని అభిమానులతో ఎంతో సంబరంగా జరుపుకున్నారు. కూకట్‌పల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి భవన విజయం మైదానం వరకూ ఊరేగింపు నిర్వహించారు.

సరికొత్త పాత్రలో రావు రమేష్

'రావు రమేష్‌ను ఇప్పటివరకు చూసిన దాని కన్నా పదిరెట్లు ఎక్కువ ఎంటర్‌టైన్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. మారుతినగర్ సుబ్రహ్మణ్యం సినిమా చిత్రీకరణపరంగా ఆయన మాకు ఎంతో సహాయంచేశారు. ఆయన షెడ్యూల్ బిజీగా ఉన్నప్పటికీ ఎక్కువ డేట్స్ కేటాయించి ఎంతో సహకరించారు' అని దర్శకుడు లక్ష్మణ్‌కార్య అన్నారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమాలో రావు రమేష్‌ది లీడ్ రోల్. నటి ఇంద్రజ కూడా కీలకపాత్రధారి. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, అజయ్, హర్షవర్ధన్, ప్రవీణ్ ఇతర ప్రధాన తారాగణం. కళ్యాణ్‌నాయక్ సంగీతం, బాల్‌రెడ్డి సినిమాటోగ్రఫీ అందించారు.

నిర్మాతగా సమంత

'ట్రాలాల బ్యానర్' పేరుతో సమంత ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించారు. సమంత ఫేవరేట్ పాప్ ఆల్బమ్ పేరు ఇది. 'చిన్నప్పట్నుంచి ఆ పాట విని పెరిగానని.. అందుకే ఆ పాటపై ఉన్న ప్రేమతోనే తన బ్యానర్‌కు కూడా ఇదే పేరు పెట్టినట్లు ఆమె చెప్పారు. "ఇందులో కొత్త వాళ్లకు ఎక్కువగా అవకాశాలు ఇస్తాం. మంచి కథలు వస్తే ఎవరికైనా అవకాశం ఉంటుంది." అని తెలిపారు. ప్రస్తుతానికి తమిళంలో ఓ షో ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

'వాట్ ది ఫిష్' నిహారిక

నిహారిక కొణిదెల కీలకపాత్రలో 'వాట్ ది ఫిష్' సినిమా తెరకెక్కుతోంది. కథ, స్క్రీన్ ప్లే వరుణ్ కోరుకొండ రాశారు. 6ఐఇ సినిమాస్‌పై విశాల్ బెజవాడ, సూర్య బెజవాడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి నిహారిక ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. అష్టలక్ష్మి పాత్రలో ఆమె కనిపించబోతోంది. ఈ చిత్రానికి శక్తికాంత్ కార్తీక్ సంగీతం అందిస్తున్నారు. సూర్య బెజవాడ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

'ఆపరేషన్ వాలెంటైన్' టీజర్ విడుదల

వరుణ్ తేజ్ నటిస్తున్న 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం నుండి తాజాగా టీజర్ విడుదలైంది. శక్తిప్రతాప్ సింగ్ ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. మాజీ మిస్ యూనివర్స్ మానుషి చిల్లర్ కథానాయికగా నటిస్తున్నారు. 'మన ఎయిర్ ఫోర్స్‌ని ఇంకొక దేశంలోకి పంపించడమంటే ఇట్స్ ఏ డిక్లరేషన్ ఆఫ్ వార్'. 'ఇలా ప్రతీకారం తీర్చుకుంటూ పోతే.. దేశాలు ఉండవు బార్డర్స్ మాత్రమే ఉంటాయి' అంటూ బ్యాక్‌గ్రౌండ్ వాయిస్ ఓవర్‌తో ఈ టీజర్ మొదలైంది.

సిరీస్‌పై దృష్టి

నేడు దక్షిణాఫ్రికాతో రెండో వన్డే

జెబెర్హా(సెయింట్ జార్జెస్ పార్క్): తొలి వన్డేలో ఘన విజయం సాధించిన టీమిండియా.. ఇక సిరీస్‌పై కన్నేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన తొలి వన్డేలో 8వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. రెండో వన్డేల్లో రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగనుంది. పేసర్లు ఆర్షదీప్, ఆవేశ్ ఖాన్ బౌలింగ్‌లో చెలరేగడంతో తొలి వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు 116పరుగులకే ఆలౌటైంది. ఆ లక్ష్యాన్ని టీమిండియా 2వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. వన్డేల్లో అరంగేట్రం చేసిన సాయి సుదర్శన్(55), శ్రేయస్ అయ్యర్(52) అర్ధసెంచరీలతో రాణించారు. కెప్టెన్ కెఎల్ రాహుల్ సారథ్యంలోని టీమిండియా దుర్భేధ్య ఫామ్‌లో ఉంది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో బలంగా ఉండగా.. దక్షిణాఫ్రికా జట్టు తొలిసారి పింక్ జెర్సీ వన్డేలో ఓటమిపాలైంది. అలాగే ఆ జట్టులో నిలకడ లేమి స్పష్టంగా కనబడుతోంది.

ఇండియా: కెఎల్ రాహుల్(కెప్టెన్, వికెట్ కీపర్), గైక్వాడ్, సాయి సుదర్శన్, శ్రేయస్, తిలక్ వర్మ, సంజు, అక్షర్, ఆర్షదీప్, ఆవేశ్ ఖాన్, కుల్దీప్, ముఖేశ్ కుమార్.

దక్షిణాఫ్రికా: మార్క్‌క్రమ్(కెప్టెన్) హెన్రిక్స్, జోర్జి, దుస్సెన్, క్లాసెన్(వికెట్ కీపర్), మిల్లర్, ఫెల్హ్లువాయో, కేశవ్ మహరాజ్, బర్గర్, షాంసీ.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68